RNI NO .TGTEL/25/A4366

E69 NEWS

తెలుగు

# గళం

సామాన్యుల గుండె చప్పుడు

విలేకరులు కావలెను

తెలుగు గళం దినపత్రికలో పని

చేయుటకు నియోజక వర్గాల వారీగా

విలేకరులు కావలెను వాట్సప్ నెం:

9959812941- 9949356387

PUBLISHED: TELANGANA | సంపుటి: 01 | సంచిక: 18 | గురువారం, 04 డిసెంబర్, 2025 | ఎడిటర్: రాయపర్తి భానుప్రసాద్ | పేజీలు: 8 | వేల: 05/-




## సర్పంచ్ ఎన్నికలకు పోటాపోటీ

- సగటున ఒక్కో స్థానంలో ఆరుగురి పోటీ
- ముగిసిన మొదటి విడత నామినేషన్ల ఉపసంహరణ
- గత నెల 25న పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది.
- మొదటి విడతలో 518 నామినేషన్లు..
- ఓడితే పరిషత్ వైపు...

## చుట్టూ మరో 2 రింగు రోడ్లు, హై స్పీడ్ కారిడార్స్..

- తెలంగాణ అభివృద్ధి లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి త్వరలో "తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్"ను విడుదల చేయనున్నారు.
- ఈ ప్రణాళికలో 770 కి.మీ 'ప్రజా వలయం' (రూరల్ రింగ్ రోడ్), 1,150 కి.మీ 'తెలంగాణ మణిహారం' (బోర్డర్ రింగ్ రోడ్) మరియు 2,550 కి.మీ రేడియల్ రోడ్ల విస్తరణ ముఖ్యమైనవి.



## విమానయాన రంగాన్ని కుదిపేసిన టెక్ గ్లిచ్

- అమాడియస్ సాఫ్ట్‌వేర్ గ్లిచ్‌తో ఎయిర్‌పోర్టుల్లో జాప్యం
- 45 నిమిషాల పాటు నిలిచిపోయిన చెక్-ఇన్ సేవలు
- విమానయాన రంగానికి డిజిటల్ వెన్నెముక లాంటిది ఈ సాఫ్ట్‌వేర్




## కేటీఆర్ ఇక్కడ రాజకీయం చెయ్.

- రేవంత్ రెడ్డి సహా మేం సిద్ధం
- రాహుల్ గాంధీది త్యాగాల కుటుంబమన్న జగ్గారెడ్డి
- కేసీఆర్ కుటుంబం ఉద్యమం సమయంలో రాజకీయం చేసిందని విమర్శ




## వాట్సాప్‌కు పోటీగా ఎక్స్ చాట్




- ఎలాన్ మస్క్ అంటేనే అద్భుతాలకు, సంచలనాలకు మారుపేరు.
- డేరింగ్, డాషింగ్ నిర్ణయాలు తీసుకోవడంలో దిట్ట.
- ఈక్రమంలో తాజాగా మరో సంచలనానికి తెరదీశారు.

## బెంగళూరులో ప్రాణాలు కోల్పోయిన తెలుగు జంట!

- విషాదంగా ముగిసిన సహజీవనం
- ప్రియురాలిని హత్య చేసి ఉరివేసుకున్న ప్రియుడు
- మద్యం మత్తులో గొడవ వల్లే ఘోరం జరిగిందని అనుమానం

## పటిష్ట నిఘా



పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా పోలీసు యంత్రాంగం గ్రామాల్లో పటిష్ట నిఘా ఏర్పాటు చేసింది.

## 359 కూడా సరిపోలేదా

- భారత్‌తో జరుగుతున్న వన్డే సిరీస్‌లో రెండో మ్యాచ్‌లో గెలిచిన సౌతాఫ్రికా.. సిరీస్‌ను 1-1తో సమం చేసింది.
- రాయ్‌పూర్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో భారత్ నిర్దేశించిన 359 పరుగుల లక్ష్యాన్ని ప్రొటీస్ జట్టు ఛేజ్ చేసింది.
- ఈ మ్యాచ్‌లో తొలుత రుతురాజ్ గైక్వాడ్, విరాట్ కోహ్లీ శతకాలతో భారత్ 5 వికెట్ల నష్టానికి 358 పరుగులు చేసింది.
- ఈ సిరీస్‌లో నిర్ణయాత్మక మూడో వన్డే డిసెంబర్ 6న విశాఖలో జరగనుంది.



# విమానయాన రంగాన్ని కుదిపేసిన టెక్ గ్లిచ్

నిన్న ఓ ప్రధాన విమానయాన సాఫ్ట్‌వేర్ సిస్టమ్‌లో కేవలం 45 నిమిషాల పాటు తలెత్తిన సాంకేతిక లోపం (గ్లిచ్) విమానాశ్రయాల్లో గందరగోళానికి దారితీసింది. చెక్-ఇన్ ప్రక్రియలు నెమ్మదించడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం సిస్టమ్ స్థిరంగా ఉందని, విమానాలు షెడ్యూల్ ప్రకారమే నడుస్తున్నాయని ఎయిర్ ఇండియా తర్వాత ప్రకటించింది. విమానయాన పరిశ్రమలో విస్తృతంగా ఉపయోగించే 'అమాడియస్' అనే సాఫ్ట్‌వేర్‌లోనే ఈ సమస్య తలెత్తినట్లు విమానయాన సంస్థలు తెలిపాయి. ప్రపంచంలోని అతిపెద్ద ట్రావెల్-టెక్నాలజీ ప్లాట్‌ఫామ్‌లలో అమాడియస్ ఒకటి. టికెట్ బుకింగ్, చెక్-ఇన్, సీట్ల కేటాయింపు, బోర్డింగ్, డిపార్చర్ కంట్రోల్ వరకు అన్ని కీలక కార్యకలాపాలను నిర్వహించడానికి విమానయాన సంస్థలు దీనిపైనే ఆధారపడతాయి. ఇది విమానయాన సంస్థలకు ఒక డిజిటల్ వెన్నెముక లాంటిది. అమాడియస్ సిస్టమ్‌ను ప్రపంచవ్యాప్తంగా అనేక ఎయిర్‌లైన్స్ ఉపయోగిస్తాయి. ఇది కేంద్రీకృత వ్యవస్థ కావడంతో, ఇందులో చిన్న లోపం తలెత్తినా దానిపై ఆధారపడిన అన్ని సంస్థల సేవలు ఒకేసారి నిలిచిపోతాయి. ప్రతిరోజూ లక్షలాది బుకింగ్‌లు, చెక్-ఇన్‌లను ఇది నిర్వహిస్తుంది. చెక్-ఇన్, బ్యాగేజ్, బోర్డింగ్ వంటివన్నీ ఒకదానికొకటి అనుసంధానమై ఉండటంతో, ఒకచోట సమస్య వస్తే మొత్తం ప్రక్రియపై ప్రభావం పడుతుంది. ప్రస్తుతానికి సమస్య పరిష్కారమైనప్పటికీ, ఆధునిక విమాన ప్రయాణాలు ఇలాంటి సంక్లిష్ట టెక్నాలజీపై ఎంతగా ఆధారపడి ఉన్నాయో ఈ సంఘటన స్పష్టం చేస్తోంది.

# పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా పోలీసు యంత్రాంగం గ్రామాల్లో పటిష్ట నిఘా ఏర్పాటు చేసింది.

జగిత్యాల, డిసెంబరు 3 : పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా పోలీసు యంత్రాంగం గ్రామాల్లో పటిష్ట నిఘా ఏర్పాటు చేసింది. జిల్లాలో 385 పంచాయతీలు ఉండగా 3,536 వార్డులున్నాయి. జిల్లా వ్యాప్తంగా 477 లొకేషన్లలో 3,536 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో 733 పోలింగ్ స్టేషన్లు సాధారణం కాగా, 733 పోలింగ్ స్టేషన్లను సున్నితమైనవిగా, ఒక పోలింగ్ స్టేషన్ అతి సున్నితమైనదిగా, 332 పోలింగ్ స్టేషన్లు సమస్యాత్మకమైనవిగా గుర్తించారు. జిల్లా వ్యాప్తంగా 197 వెబ్ కాస్టింగ్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. క్షేత్ర స్థాయిలో పరిస్థితిని ఎప్పటికప్పుడు ఎన్నికల సంఘానికి అందజేయడానికి 89 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించారు. వీరికి అవసరమైన శిక్షణను కలెక్టర్ సత్య ప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్‌లు నిర్వహించి సంపూర్ణ అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు బలగాలు, రిజర్వ్ ఫోర్సు బలగాలు, నిఘా టీంలు నిత్యం పర్యవేక్షణ చేస్తున్నాయి. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో నగదు తరలింపుపై దృష్టి సారించింది. సర్పంచ్, వార్డు స్థానాలకు పోటీ చేయాలని భావించే ఆశావహులు, వారి బంధు మిత్రులపై నిఘా ఉంచింది. ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే అవకాశం ఉన్నందున వారి రాక పోకలు సహా బ్యాంక్ అకౌంట్లపైనా దృష్టి పెట్టింది. తనిఖీల్లో రూ. 50 వేలకు మించి నగదు దొరికితే పోలీసులు స్వాధీనం చేసుకోనున్నారు. జిల్లా, మండల, గ్రామ సరిహద్దులు, ప్రధాన రహదారులపై పోలీస్ పికెట్లను ఏర్పాటు చేశారు. ఇప్పటికే తనిఖీ విభాగాలకు మండల తహసీల్దార్లను నోడల్ అధికారులుగా నియమించింది. సరైన ఆధారాలు (వస్తు కొనుగోలు-అమ్మకాలకు సంబంధించిన రసీదులు) చూపిస్తేసరి, లేదంటే ఆయా నగదును స్వాధీనం చేసుకోనుంది. పెద్ద మొత్తంలో మద్యం కొనుగోళ్లు, సరఫరా, బంగారం, వెండి వస్తువులు, చీరలు, ఇతర వస్తు కొనుగోళ్లపైనా నిఘా పెంచారు. ఇప్పటికే ఆయా దుకాణాల యజమానులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించే వారిపై క్రిమినల్ కేసులు నమోదుతో పాటు జైలుకు పంపేందుకు రంగం సిద్ధం చేస్తోంది. జిల్లాలో 385 పంచాయతీలు, 3,536 వార్డు స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయి. పోలింగ్, కౌంటింగ్ కోసం పకడ్బందీ చర్యలు చేపడుతుంది. ఇందుకు ఎన్నికల కమిషన్ 12 విభాగాలను ఏర్పాటు చేసింది. వీటికి ఒక్కో నోడల్ అధికారిని నియమించింది. పోలింగ్‌కు ఎంతమంది సిబ్బంది అవసరం, ఎక్కడ విధులు నిర్వర్తించాలి, ఓటింగ్‌లో ఎవరు పాల్గొనాలి, కౌంటింగ్‌లో ఎవరు పాల్గొనాలి, తదితర పనుల పర్యవేక్షణకు మానవవనరుల విభాగాన్ని ఏర్పాటు చేసి నోడల్ అధికారిగా డీఈఓ రాము, ఎల్‌డీఎం రాముకుమార్‌లను నియమించింది. బ్యాలెట్ బాక్సులు ఎన్ని అవసరం, ఎలా సమకూర్చాలి, పోలింగ్ కేంద్రానికి ఎలా తరలించాలి, అటునుంచి స్ట్రాంగ్ రూమ్‌కు ఆ తర్వాత కౌంటింగ్ హాల్‌కు ఎలా తరలించాలి, వంటి పర్యవేక్షణకు బ్యాలెట్ బాక్సుల విభాగాన్ని ఏర్పాటు చేసి నోడల్ అధికారిగా డివిజనల్ పంచాయతీ ఆఫీసర్ సుదర్శన్‌ను నియమించారు. సిబ్బందిని పోలింగ్ బూత్‌లకు తరలింపు అటు నుంచి మళ్లీ వారి గమ్యస్థానాలకు చేర్చేందుకు వాహనాలను పెద్ద సంఖ్యలో సమకూర్చాల్సి ఉంది. ఇందుకు జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్‌ను నోడల్ ఆఫీసర్‌గా నియమించింది. సిబ్బందికి శిక్షణకు డిస్ట్రిక్ట్ యూత్ ఆఫీసర్ రవి కుమార్‌ను,, మెటీరియల్ మేనేజ్‌మెంట్ విభాగానికి జడ్పీ డిప్యూటీ సీఈవో నరేశ్‌ను నోడల్ ఆఫీసర్‌గా, బ్యాలెట్ పేపర్ల నిర్వహణకు జిల్లా సహకార అధికారి మనోజ్ కుమార్‌ను నోడల్ ఆఫీసర్‌గా, హెల్ప్‌లైన్, ఫిర్యాదుల విభాగానికి జిల్లా సంక్షేమ అధికారి బోనగిరి నరేశ్‌ను నోడల్ అధికారిగా, రిపోర్ట్స్, రిటర్న్స్ విభాగానికి అడిషనల్ డీఆర్‌డీవో మదన్‌మోహన్, విమల, శ్రీధర్‌లను నోడల్ ఆఫీసర్‌గా నియమించింది. ఎన్నికల ప్రచారంలో అభ్యర్థుల వారీగా ఖర్చు చేస్తుంటారు. వాహనాల ర్యాలీలు నిర్వహిస్తుంటారు. గ్రామాల పర్యటనకు వాహనాల వినియోగం, బ్యానరర్లు, పోస్టర్లు, ఫ్లెక్సీలు సమకూర్చుకుంటారు. వీటితో పాటు వెంట తిరిగే కార్యకర్తలకు అల్పాహారం, మధ్యాహ్న భోజనం, మద్యం, మాంసాహారంలను సమకూర్చుతుంటారు. లెక్కకు మించి ఖర్చు చేసే వారిపై గట్టి నిఘాను ఏర్పాటు చేసింది. ఎంసీసీ మానిటరింగ్ నోడల్ ఆఫీసర్‌గా జిల్లా ఆడిట్ అధికారి సుజాతను, పరిశీలక విభాగం నోడల్ ఆఫీసర్‌గా జిల్లా మెప్మా అధికారి దుర్గపు శ్రీనివాస్ గౌడ్‌ను, బ్యాలెట్ పేపర్ల నిర్వహణకు నోడల్ అధికారిగా జిల్లా సహకార శాఖ అధికారి మనోజ్ కుమార్‌ను నియమించారు. వీరంతా సమీకృత కలెక్టరేట్ కేంద్రంగా ఆయా పనులను పర్యవేక్షిస్తుంటారు. జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో ఏడు పోలీసు చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా జగిత్యాల – నిజామాబాద్ సరిహద్దు ప్రాంతమైన బండలింగాపూర్ గండి హనుమాన్, జగిత్యాల – నిర్మల్ సరిహద్దు మల్లాపూర్ మండలం ఒబులాపూర్, రాయికల్ మండలం బోర్నపల్లి, జగిత్యాల – సిరిసిల్ల సరిహద్దు కథలాపూర్ మండలం కలికోట, జగిత్యాల – కరీంనగర్ సరిహద్దు కొడిమ్యాల మండలం పూడూరు, జగిత్యాల – మంచిర్యాల సరిహద్దు ధర్మపురి మండలం రాయపట్నం, బీర్‌పూర్ మండలం కమ్మునూర్ ప్రాంతాల్లో పోలీసు చెక్ పోస్టులను ఏర్పాటు చేసిన నిరంతరం తనిఖీలు చేస్తున్నారు.

## కేటీఆర్ ఇక్కడ రాజకీయం చెయ్.

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలంగాణలో రాజకీయాలు చేసుకోవచ్చని, ఆయనను ఎదుర్కొనేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, తాము సిద్ధంగా ఉన్నామని తెలంగాణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి స్పష్టం చేశారు. అయితే, జాతీయ నాయకుడు రాహుల్ గాంధీని విమర్శిస్తే మాత్రం ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు. గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమం సమయంలో కేసీఆర్ కుటుంబం రాజకీయ లబ్ధి పొందిందని ఆరోపించారు. తమ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీని విమర్శించే స్థాయి, ప్రశ్నించే హక్కు కేటీఆర్‌కు లేదని ఆయన అన్నారు. రాహుల్ గాంధీది త్యాగాల కుటుంబమని, కేసీఆర్ కుటుంబం ఉద్యమం జరుగుతున్నప్పుడే రాజకీయంగా ఎదిగిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. విలువల్లేని రాజకీయాలు ఏమాత్రం మంచిది కాదని ఆయన హితవు పలికారు. కేటీఆర్‌కు నైతిక విలువలు ఉంటే రాహుల్ గాంధీ గురించి మరోసారి ఇష్టానుసారంగా మాట్లాడవద్దని అన్నారు. కాంగ్రెస్ జాతీయ పార్టీ అని, బీఆర్ఎస్ ప్రాంతీయ పార్టీ అని గుర్తు చేశారు. కేటీఆర్ తెలంగాణలో రాజకీయం చేసుకోవచ్చని, కానీ రాహుల్ గాంధీని విమర్శించవద్దని ఆయన తేల్చి చెప్పారు.

## బెంగళూరులో ప్రాణాలు కోల్పోయిన తెలుగు జంట!

బెంగళూరులో ఓ జంట సహజీవనానికి విషాదకర ముగింపు పలికింది. ప్రియురాలిని దారుణంగా హత్య చేసిన ప్రియుడు, ఆ తర్వాత తానూ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాజగోపాలనగర పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇందిరా ప్రియదర్శిని నగరలో సోమవారం అర్ధరాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. మృతులను గదగ లలిత (49), లక్ష్మీనారాయణ (51)గా పోలీసులు గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లలితకు ఇదివరకే వివాహమై పిల్లలున్నారు. కుటుంబంతో విభేదాల కారణంగా బెంగళూరు వచ్చి ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తోంది. ఈ క్రమంలో ఇలాంటి కుటుంబ నేపథ్యమే ఉన్న లక్ష్మీనారాయణతో పరిచయం ఏర్పడింది. అది ప్రేమగా మారడంతో గత ఎనిమిది నెలలుగా ఇద్దరూ కలిసి అద్దె ఇంట్లో ఉంటున్నారు. సోమవారం విధులకు వెళ్లి రాత్రి ఇంటికి తిరిగొచ్చిన వీరిద్దరూ మద్యం సేవించారు. ఈ క్రమంలో వారి మధ్య గొడవ జరిగినట్లు స్థానికులు తెలిపారు మద్యం మత్తులో మాటామాటా పెరగడంతో లక్ష్మీనారాయణ ఆమెను తీవ్రంగా కొట్టి, స్పృహ కోల్పోయాక ఫ్యాన్‌కు ఉరివేసి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. అనంతరం అదే చీర మరోకొనతో అతడు కూడా ఉరివేసుకుని ప్రాణాలు తీసుకున్నాడు. మంగళవారం ఉదయం ఇంటి తలుపులు తెరవకపోవడంతో అనుమానం వచ్చిన ఇరుగుపొరుగు వారు కిటికీలోంచి చూడగా, ఇద్దరూ విగతజీవులుగా కనిపించారు. వారి సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, తలుపులు పగలగొట్టి మృతదేహాలను విక్టోరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనకు కచ్చితమైన కారణాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# చేరుకోలేనంత దూరమా?

రహదారులపై మృత్యు విలయం కొనసాగుతూనే ఉంది. తెలుగు రాష్ట్రాల్లో వరుస బస్సు ప్రమాదాలు ప్రజలను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తున్నాయి. కర్నూలు దుర్ఘటన మరువకముందే చేవెళ్ల వద్ద జరిగిన మరో ప్రమాదం, ఆ తర్వాత పలు ప్రాంతాల్లో చోటుచేసుకున్న అయిదు బస్సు ప్రమాదాలు%-% ఇది కేవలం దురదృష్టకర ఘటనల పరంపర కాదుబీ ఇది వ్యవస్థాపరమైన లోపాలకు, నిర్లక్ష్యానికి అద్దం పడుతున్న విషాదం.కేంద్ర రోడ్డు రవాణా శాఖ ఈ ఏడాది విడుదల చేసిన నివేదిక ప్రకారం 2023లో దేశవ్యాప్తంగా 4.80 లక్షల రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకోగా, వాటిలో 1.72 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారు. 4.62 లక్షల మంది గాయపడ్డారు. గత అయిదేళ్లలో ప్రమాదాల సంఖ్య 10శాతం పెరగడం చూస్తే రహదారి భద్రత గాల్లో దీపమైందని స్పష్టంగా తెలుస్తోంది. జాతీయ, రాష్ట్ర హైవేలపైనే దాదాపు 60 శాతం ప్రమాదాలు జరుగుతున్నాయి. జాతీయ రహదారులపై మృత్యుఘోష పరంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వరుసగా 8, 9 స్థానాల్లో ఉన్నాయి. బాధితుల్లో ఎక్కువమంది మధ్యతరగతి, పేద ప్రజలే. సంపాదించే వయసులోని వ్యక్తులను బలి తీసుకుంటున్న ప్రమాదాలు%-% అనేక కుటుంబాలను ఆర్థికంగా, మానసికంగా ఛిద్రం చేస్తున్నాయి. తాజాగా తమిళనాడులోని శివగంగ జిల్లాలో జరిగిన బస్సు ప్రమాదం పదిమందిని బలితీసుకోవడంతోపాటు ఎంతోమందిని క్షతగాత్రులుగా మార్చింది. మన తెలుగు రాష్ట్రాల్లో ఇటీవలి కర్నూలు, చేవెళ్ల బస్సు ప్రమాదాలు కేవలం యాదృచ్ఛిక ఘటనలు కాదు. రహదారి మౌలిక వసతుల లోపాలు, అతివేగం, ఓవర్‌లోడింగ్, డ్రైవర్లకు శిక్షణ లోపం, పథకాల ప్రభావం... ఇవన్నీ కలిసి భద్రతను తుంచేస్తున్నాయి. అధికారుల లెక్కల ప్రకారం రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం అతివేగమే. అంతేకాదు, రహదారి రూపకల్పనలో లోపాలు, తప్పుడు ప్రాజెక్టు నివేదికలు, ఇంజనీరింగ్ వైఫల్యాలు, నిర్లక్ష్య పర్యవేక్షణ.. ఇవే నిజమైన హంతకులు. హైవేల బ్లాక్‌స్పాట్లను సరిదిద్దడంలో యంత్రాంగం విఫలమైందని ఇటీవలే పార్లమెంటరీ కమిటీ తేల్చింది. ఏఐ, సెన్సార్లు, బ్రీత్ ఎనలైజర్లు, స్పీడ్ కెమెరాలు, డివైడర్లు, ఫ్లై ఓవర్లు... అన్నీ మనకు ఉన్నాయి. కానీ మన నగరాలు ఇంకా ప్రమాదాల గుట్టలే! టోక్యో, షాంఘై వంటి అధిక జనసాంద్రత నగరాలు భద్రతతో ఉన్నాయంటే... అది మౌలిక వసతులు, చట్టపరమైన క్రమశిక్షణ ఫలితం. మన దగ్గర మాత్రం లైసెన్సుల జారీ అవకతవకలు, మద్యం దుకాణాలు హైవే పక్కనే, అశిక్షిత డ్రైవర్లు, ఇరుకు రోడ్లు.. ఇవన్నీ రోడ్డు ప్రమాదానికి కారణాలే. ఆంధ్రప్రదేశ్‌లో ఈ ఏడాదిలో ఇప్పటివరకు 3,000కు పైగా మరణాలు నమోదయ్యాయి. విజయవాడ, విశాఖపట్నం వంటి నగరాల్లో అతివేగం 373 ప్రాణాలను బలితీసుకుంది. తెలంగాణలోనూ అదే పరిస్థితి! ఎన్‌హెచ్- 65, ఎన్‌హెచ్- 44, ఎన్‌హెచ్-163 వంటి జాతీయ రహదారులపై అత్యధిక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మహిళల ఉచిత ప్రయాణ పథకాలు 'మహాలక్ష్మి', 'స్త్రీ శక్తి' సమాజానికి ఆశీర్వాదమే. కానీ బస్సుల సంఖ్య పెంచకుండా రద్దీ పెరగడం డ్రైవర్లపై ఒత్తిడిని పెంచుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వాలు మేల్కోవాలి. డ్రైవర్లకు శిక్షణనివ్వాలి. నియమిత శిక్షణా కార్యక్రమాలు, లైసెన్స్ ప్రక్రియలో పారదర్శకత ఉండేలా చూసుకోవాలి. అతివేగ నియంత్రణకు స్పీడ్ కెమెరాలు, భారీ జరిమానాలు, ట్రాఫిక్ మానిటరింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలి. ప్రమాదకర రోడ్ల విస్తరణ, సైనేజ్, లైటింగ్, బారియర్లు ఏర్పాటు చేయాలి. మహాలక్ష్మి, స్త్రీ శక్తి వంటి పథకాల కోసం కొత్త బస్సులు సమకూర్చాలి. మీడియా, విద్యాసంస్థల ద్వారా ప్రజల్లో భద్రతా చైతన్యం పెంచాలి.

## ఎయిడ్స్ కేసుల్లో ప్రపంచంలోనే రెండో దేశం

ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఇటీవల కేంద్ర ఆరోగ్య శాఖ విడుదల చేసిన నివేదిక విడుదల చేసింది. ఆ నివేదిక ప్రకారం హెచ్ఐవీతో జీవిస్తున్న వ్యక్తుల సంఖ్య భారతదేశంలో సుమారు 25.61 లక్షలుగా ఉన్నట్లు తెలిసింది. అయితే ఈ సంఖ్య బట్టి చూస్తే.. భారత్ ప్రపంచంలోనే రెండో అతిపెద్ద హెచ్ఐవీ బాధితులు ఉన్న దేశం కావడం గమనార్హం. ఇంటర్నేషనల్ ఎయిడ్స్ డే రోజున.. కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా విడుదల చేసిన 'ఇండియా హెచ్ఐవీ ఎస్టిమేషన్ 2025' నివేదిక ప్రకారం.. 2024లో దేశంలో 25.61 లక్షల మంది హెచ్ఐవీతో జీవిస్తున్నారని వెల్లడైంది. మహారాష్ట్రలో అత్యధికంగా 3.99 లక్షల మంది ఎయిడ్స్ రోగులు ఉండగా.. ఆంధ్రప్రదేశ్‌లో 3.10 లక్షలు, కర్ణాటక 2.91 లక్షలు, తెలంగాణలో 2 లక్షల మంది ఉన్నారు. దేశంలోని మొత్తం బతికి ఉన్న హెచ్ఐవీ రోగుల్లో 74 శాతం మంది కేవలం ఇలాంటి 9 రాష్ట్రాల్లోనే ఉండటం గమనార్హం.

## సర్పంచ్ ఎన్నికలకు పోటాపోటీ

మంచిర్యాల, డిసెంబరు 3: జిల్లాలో సర్పంచ్ ఎన్నికలకు పోటాపోటీ నెలకొంది. గత నెల 25న పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. ఆ మరునాడు నుంచే ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. జిల్లాలో మూడు విడతలుగా పంచాయతీ ఎన్నికలను నిర్వహించేందుకు ఈసీ షెడ్యూల్ జారీ చేసింది. దీంతో గత నెల 27 నుంచి 29 వరకు మొదటి విడత నామినేషన్ల ప్రక్రియ కొనసాగింది. మొదటి విడతలో భాగంగా మంచిర్యాల నియోజకవర్గంలోని హాజీపూర్, లక్షెట్టిపేట, దండేపల్లితో పాటు ఖానాపూర్ నియోజకవర్గంలోని జన్నారం మండలాల్లో నామినేషన్ ప్రక్రియ పూర్తయింది. అలాగే రెండో విడతలో బెల్లంపల్లి నియోజకవర్గంలోని బెల్లంపల్లి, తాండూర్, నెన్నెల, భీమిని, వేమనపల్లి, కన్నెపల్లి, కాసిపేట మండలాల్లో ఈనెల రెండో తేదీతో నామినేషన్ల ప్రక్రియ పూర్తయింది. మూడో విడతలో చెన్నూర్ నియోజకవర్గంలోని చెన్నూర్, కోటపల్లి, భీమారం, జైపూర్, మందమర్రి మండలాల్లో బుధవారం నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నెల 5వ తేదీతో నామినేషన్ల పర్వం ముగియనుంది. మొదటి విడత ఎన్నికలు ఈనెల 11న, రెండో విడతలో 14వ తేదీన, మూడో విడతకు సంబంధించి 17వ తేదీన పంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇప్పటి వరకు రెండు విడతల నామినేషన్ ప్రక్రియ పూర్తికాగా దాఖలైన నామినేషన్లను పరిశీలిస్తే సర్పంచ్ పదవులకే అధిక ప్రాధాన్యం కనిపిస్తోంది. మొదటి విడతలో మంచిర్యాల నియోజకవర్గానికి సంబంధించి దాఖలైన నామినేషన్లలో 90 సర్పంచ్ స్థానాలకుగానూ మొత్తం 518 నామినేషన్లు దాఖలయ్యాయి. 816 వార్డు స్థానాలకు గాను 1,749 నామినేషన్‌లు దాఖలయ్యాయి. సర్పంచ్ స్థానాల్లో దాదాపు ఆరు రెట్లు అధికంగా నామినేషన్లు దాఖలుకాగా వార్డు మెంబర్లకు రెట్టింపు సంఖ్యలో మాత్రమే నామినేషన్లు రావడం గమనార్హం. రెండో విడత బెల్లంపల్లి నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో 114 సర్పంచ్ స్థానాలు ఉండగా గడువు ముగిసే సరికి సర్పంచ్ స్థానానికి 758 నామినేషన్లు దాఖలయ్యాయి. అలాగే నియోజకవర్గంలో మొత్తం 996 వార్డు మెంబర్ల స్థానాలకు గాను 2,454 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇక్కడ కూడా సర్పంచ్ స్థానానికి దాదాపు ఆరు రెట్లు అధికంగా నామినేషన్లు దాఖలు కాగా వార్డు మెంబర్ల స్థానాలకు రెట్టింపు సంఖ్యలోనే నామినేషన్లు వచ్చాయి. ఇప్పటి వరకు ముగిసిన రెండు విడతల నామినేషన్ల ప్రక్రియలో సర్పంచ్ స్థానాలకే డిమాండ్ అధికంగా కనిపిస్తోంది. మూడో విడత నామినేషన్లు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. మూడో విడత కింద చెన్నూర్ నియోజకవర్గంలోని కోటపల్లి, చెన్నూరు, భీమారం, జైపూర్, మందమర్రి మండలాల్లోని 102 సర్పంచ్ స్థానాలు, 868 వార్డు సభ్యుల స్థానాలకు నామినేషన్లు స్వీకరించనున్నారు. ఇక్కడ కూడా సర్పంచ్ స్థానాలకే అధిక పోటీ నెలకొనే అవకాశాలు కనిపిస్తున్నాయి. గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా సర్పంచ్ స్థానాలకు పోటీపడుతున్న అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాలనే పట్టుదలతో ఉన్నారు. ఇప్పటికే వారికి ప్రధాన పార్టీల ముఖ్య నాయకుల మద్దతు లభించగా ఎన్నికల్లో సత్తాచాటేందుకు అన్ని అస్త్రాలను ఉపయోగిస్తున్నారు. రిజర్వేషన్ల వారీగా గెలుపు గుర్రాలకే అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలు మద్దతు తెలుపగా తమ శాయశక్తుల ప్రయత్నిస్తూ ఎన్నికల్లో గెలుపొందేందుకు అభ్యర్థులు ఉవ్విళ్లూరుతున్నారు. ఒక వేళ సర్పంచ్ ఎన్నికల్లో ఓడినా రాబోయే జిల్లా పరిషత్, మండల పరిషత్ ఎన్నికల్లోనైన పైచేయిసాధించాలనే తపనతో అధికశాతం మంది అభ్యర్థులు ఉన్నారు. ఇందు కోసం ఇప్పటి నుంచే వారు తమ ప్రణాళికలను సిద్ధం చేసుకుంటున్నారు. ఎలాగైనా స్థానిక ఎన్నికల్లో గెలుపొందాలనే పట్టుదలతో ఉన్న అభ్యర్థులు సర్పంచ్ కాకపోతే ఎంపీటీసీ, జడ్పీటీసీలుగానైనా ఎన్నికవ్వాలనే లక్ష్యంతో ఉన్నట్లు తెలుస్తోంది. ఇందు కోసం గ్రామాల ప్రజలను తమ వైపు ఆకర్షించేలా ప్రత్యేక కార్యాచరణ చేపడుతూ వస్తున్నారు. మొత్తంగా ఈసారి ఎన్నికలను మిస్ చేసుకోవద్దనే దృఢమైన లక్ష్యంతో అభ్యర్థులు పోటీపడుతుండడం గమనార్హం.

## చుట్టూ మరో 2 రింగు రోడ్లు, హై స్పీడ్ కారిడార్స్..

అంతేకాక.. హై స్పీడ్ కారిడార్ల నిర్మాణం కూడా ప్రతిపాదించారు. ఈ భారీ ప్రణాళికతో గ్రామాలు, పట్టణాలు, పరిశ్రమల మధ్య కనెక్టివిటీ పెరిగి.. రాష్ట్రంలో పెట్టుబడులు, ఉద్యోగావకాశాలు గణనీయంగా పెరుగుతాయని ప్రభుత్వం భావిస్తోంది. 'తెలంగాణ రైజింగ్' లక్ష్యాన్ని చేరుకోవడానికి.. రాష్ట్రంలోని మూలమూలనా అభివృద్ధిని వేగవంతం చేయడానికి తెలంగాణ ప్రభుత్వం ఒక భారీ మౌలిక సదుపాయాల ప్రణాళికను సిద్ధం చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిసెంబర్ 9న విడుదల చేయనున్న "తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్‌లో" ఈ సమగ్ర ప్రణాళిక వివరాలు ఉన్నాయి. గ్రామాలు, పట్టణాలు, జిల్లా కేంద్రాలను ఒకే నెట్‌వర్క్‌లో అనుసంధానించడం ఈ ప్రణాళిక ప్రధాన లక్ష్యం. ఈ విజన్ డాక్యుమెంట్‌లో ఔటర్ రింగ్ రోడ్డు అండ్ రీజినల్ రింగ్ రోడ్డు మాదిరిగా.. మరో మూడు ప్రధాన రహదారి ప్రాజెక్టులు ప్రతిపాదించారు. ఇవి రాష్ట్ర భౌగోళిక రూపురేఖలను మార్చనున్నాయి. దీనిలో ఒకటి 770 కి.మీ 'ప్రజా వలయం' . ప్రస్తుతం ఉన్న రీజినల్ రింగ్ రోడ్వె లుపల, దాదాపు 770 కి.మీ పొడవున ఈ నూతన రింగ్ రోడ్ నిర్మించబడుతుంది. ఇది అనేక జిల్లా కేంద్రాలు, మండల ప్రధాన కార్యాలయాలు, ముఖ్య పట్టణాలను వేగంగా కలుపుతుంది. దీని ద్వారా గ్రామీణ ప్రాంతాల నుంచి పెద్ద నగరాలకు రవాణా సౌకర్యం గణనీయంగా మెరుగుపడుతుంది'తెలంగాణ మణిహారం' రాష్ట్ర సరిహద్దు వెంబడి 1,150 కి.మీ పొడవున ఈ భారీ రింగ్ రోడ్‌ను నిర్మించాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. ఇది తెలంగాణ రాష్ట్రం చుట్టూ పూర్తిగా ఒక వలయంలా ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తుంది. దీంతో పాటు.. 2,550 కి.మీ రేడియల్ రోడ్లు కూడా దీనిలో ప్రతిపాదించారు. 11 ముఖ్యమైన రేడియల్ రోడ్లను అభివృద్ధి చేసి.. వాటిని మొత్తం 2,550 కి.మీ వరకు విస్తరిస్తారు. వీటిలో 375 కి.మీ ఈస్ట్-వెస్ట్ కారిడార్, 430 కి.మీ నార్త్-సౌత్ కారిడార్ ఉన్నాయి. ఈ రహదారుల విస్తరణతో జాతీయ రహదారులు 4,983 కి.మీ నుంచి 6,500 కి.మీకు.. రాష్ట్ర రహదారులు 1,687 కి.మీ నుంచి 8,600 కి.మీకు పెరగనున్నాయి. ఇది డ్రై పోర్టులు, పరిశ్రమలు, గోదాములు, ఫుడ్ ప్రాసెసింగ్ జోన్‌లకు రవాణా సౌకర్యాన్ని మెరుగుపరుస్తుంది. రహదారులతో పాటు.. ప్రభుత్వం హై స్పీడ్ రైల్వే కారిడార్లను, రీజినల్ రాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ లైన్లను కూడా ప్రతిపాదించింది. ఇవి నగర క్లస్టర్‌లను హైదరాబాద్‌తో అనుసంధానం చేస్తాయి. 2041 నాటికి హైదరాబాద్%-%బెంగళూరు హై స్పీడ్ రైల్వే కారిడార్ (618 కి.మీ), 2051 నాటికి ముంబై%-%హైదరాబాద్ హై స్పీడ్ రైల్వే కారిడార్ (709 కి.మీ) పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.

## వాట్సాప్‌కు పోటీగా ఎక్స్ చాట్

ఎలాన్ మస్క్ ఓ సంచలనం. ఆయన ఏం చేసినా అదో సంచలనం. అయితే.. వాట్సాప్ , ఇన్‌స్టాగ్రామ్ , టెలిగ్రామ్ వంటి యాప్‌లకు పోటీగా మరో సంచలనాన్ని తీసుకొచ్చాడు. ప్రముఖ మెసేజింగ్ యాప్ వాట్సాప్ కు పోటీగా ఎక్స్ యాప్ ఇప్పుడు ఎక్స్ చాట్ను తీసుకొచ్చే ప్లాన్ షురూ చేశాడు. ఈ ఎక్స్ చాట్ తన వినియోగదారులకు అంతరాయం లేని, సురక్షితమైన మెసేజింగ్ అనుభవాన్ని అందిస్తామని ఛాలెంజ్ చేస్తున్నాడు. అయితే.. వాట్సప్‌కు పోటీగా వచ్చిన ఈ ఎక్స్ చాట్ యాప్‌లో స్పెషల్ ఫీచర్లేంటో చూద్దాం.. ఎలాన్ మస్క్‌కు చెందిన ఎక్స్ యాప్‌లో కొత్తగా ఎక్స్ చాట్ పేరుతో చాట్ ఇంటర్ ఫేస్‌ను ప్రవేశపెట్టారు. ఈ ఎక్స్ చాట్ అనేది ఇన్-యాప్ డైరెక్ట్ మెసేజింగ్ ఫీచర్. ఇది వాట్సాప్ , ఇన్‌స్టాగ్రామ్ , టెలిగ్రామ్ మాదిరిగానే నిరంతరాయంగా చాట్ చేసుకునే వీలు కల్పిస్తుంది. ఈ ఎక్స్ చాట్‌లో ఎండ్-టు-ఎండ్ ఎన్‌క్రిప్షన్, డిసప్పియరింగ్ మెసేజెస్, ఆడియో/ వీడియో కాల్స్ వంటి లేటెస్ట్ ఫీచర్లను హైలైట్ చేస్తూ ఎలాన్ మస్క్ ఎక్స్ వేదికగా వివరాలు ప్రకటించారు.

## 359 కూడా సరిపోలేదా


భారత్‌తో జరుగుతున్న వన్డే సిరీస్‌లో సౌతాఫ్రికా రికార్డు స్కోరు ఛేజ్ చేసింది. బుధవారం రాయ్‌పూర్ వేదికగా జరిగిన రెండో వన్డేలో ఆ జట్టు భారత్ నిర్దేశించిన 359 పరుగుల లక్ష్యాన్ని మరో నాలుగు బంతులు మిగిలి ఉండగానే ఛేదించింది. వన్డే క్రికెట్‌లో తమ మూడో అత్యధిక రన్ ఛేజ్‌ను సక్సెస్‌ఫుల్‌గా పూర్తి చేసింది. దీంతో సిరీస్‌ను 1-1తో సమం చేసింది. డిసెంబర్ 6న నిర్ణయాత్మక మూడో వన్డే విశాఖ వేదికగా జరగనుంది. 359 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన సౌతాఫ్రికా ఆదిలోనే ఓపెనర్ క్వింటన్ డికాక్ (8) వికెట్ కోల్పోయింది. అయితే ఈ సమయంలో ఓపెనర్ ఎయిడెన్ మార్క్రమ్‌కు టెంబా బవూమా జత కలిశాడు. వీరిద్దరూ రెండో వికెట్‌కు 96 బంతుల్లోనే 101 పరుగులు స్కోరు చేశారు. 46 పరుగులు చేసిన అనంతరం బవూమా ఔట్ అయ్యాడు. ఈ సమయంలో మాథ్యూ బ్రీట్జ్ కే (64 బంతుల్లో 68 రన్స్) అదరగొట్టాడు. సమయోచితంగా ఆడుతూ.. స్కోరు బోర్డును ముందుకు తీసుకెళ్లాడు. ఈ క్రమంలోనే మార్క్రమ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. 98 బంతుల్లో 110 రన్స్ చేశాక.. అతడు పెవిలియన్ చేరిపోయాడు. ఈ సమయంలో క్రీజులోకి వచ్చిన డివాల్డ్ బ్రెవిస్.. పెను విధ్వంసం సృష్టించాడు. టీ20 స్టైల్‌లో బ్యాటింగ్ చేస్తూ మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశాడు. 34 బంతుల్లో 54 రన్స్ చేసి.. సౌతాఫ్రికాకు విజయాన్ని సులువు చేశాడు. చివర్లో కార్బిన్ బాష్ (15 బంతుల్లో 29 పరుగులు) కూడా సత్తాచాటడంతో సౌతాఫ్రికా మరో నాలుగు బంతులు మిగిలి ఉండగానే.. 6 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. భారత బౌలర్లలో అర్షదీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణ రెండేసి వికెట్లు తీశారు. హర్షిత్ రాణా, కుల్‌దీప్ యాదవ్ ఒక్కో వికెట్ పడగొట్టారు. అంతకుముందు బ్యాటింగ్ చేసిన భారత్.. రుతురాజ్ గైక్వాడ్, విరాట్ కోహ్లీ సెంచరీలతో 5 వికెట్ల నష్టానికి 358 పరుగులు చేసింది. ఈ మ్యాచ్ ఫలితంతో ప్రస్తుతం సిరీస్ 1-1తో సమమైంది. నిర్ణయాత్మక మూడో వన్డే డిసెంబర్ 6న విశాఖ వేదికగా జరగనుంది.

# సూర్య నాయక్ తండా నుండి టీఆర్పీ సర్పంచ్ అభ్యర్థిగా హారిక నామినేషన్



తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి సూర్య నాయక్ తండా గ్రామం నుండి తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ) తరపున సర్పంచ్ అభ్యర్థిగా గూగులోతు హారిక జవహర్లాల్ (తీన్మార్ జై) నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి టీఆర్పీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు రవి పటేల్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ గౌడ్, మహిళా జిల్లా అధ్యక్షురాలు బాలినే లక్ష్మి, నాయకులు బాలినే జగన్మోహన్, సత్యనారాయణ తదితరులు హాజరై అభినందనలు తెలిపారు. తరువాత రవి పటేల్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌లో చెప్పిన బీసీలకు 42% రిజర్వేషన్ హామీ తప్పుదారి పట్టించే ప్రయత్నమని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలు గుణపాఠం చెప్తారని అన్నారు. టీఆర్పీ లక్ష్యం పేదలకు విద్య, వైద్యం, సత్వర న్యాయం అందించడం, భూమిలేని కుటుంబాలకు రెండు ఎకరాలు ఇచ్చే సంకల్పం అమలు చేయడం అన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల అభివృద్ధి కోసం టీఆర్పీ పుట్టిందని పేర్కొన్నారు. యువ అభ్యర్థి హారికను గెలిపిస్తే గ్రామ అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని, ఆమె ప్రజల కోసం నిస్వార్థంగా పనిచేస్తుందని రవి పటేల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రణయ్ రాజ్, జినుకల శ్రీను, సామల చంద్రశేఖర్, ప్రణీత్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీని విడిచి బిఆర్ఎస్‌లో చేరిన రూపిరెడ్డిపల్లి నాయకులు



తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి రేగొండ రేగొండ మండలం రూపిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ముడతనపెల్లి కుమారస్వామి ఈరోజు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బిఆర్ఎస్ పార్టీలో చేరారు. భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి సమక్షంలో ఆయన గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గండ్ర వెంకట రమణా రెడ్డి మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో బిఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న చర్యలతో ఆకర్షితులు అయ్యే నాయకులు, కార్యకర్తలు భారీగా పార్టీలో చేరుతున్నారని తెలిపారు. పార్టీ బలోపేతానికి కొత్తగా చేరిన నాయకుల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. కుమారస్వామి మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం బిఆర్ఎస్ ప్రభుత్వమే పనిచేసిందని, అందుకే పార్టీ మారాలని నిర్ణయించుకున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు పంచగిరి సుధాకర్, మాజీ ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, మేడిపల్లి అశోక్, కొండా సురేందర్, పన్నాటి శ్రీనివాస్, కనుకుంట్ల దేవేందర్, రూపిరెడ్డి భగవాన్ రెడ్డి, చంద్రారెడ్డి, మేడిపల్లి ప్రభాకర్, రియాజ్, రావుల రమేష్, సరువు రాజు, వెంకటేష్, రావుల రజినీకాంత్, సదాశివచారి, రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.


# చిల్లంచెర్ల లో నామినేషన్ వేసిన బీజేపీ అభ్యర్థి

**- మరిపెడ మండలం లో తొలి బీజేపీ పార్టీ నామినేషన్**




మహబూబాబాద్ జిల్లా తెలుగు గళం. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ నియోజకవర్గంలోని మరిపెడ మండలం చిల్లంచర్ల గ్రామంలో మహిళా కోలాటాలతో ర్యాలీగా వచ్చి బిజెపి పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా గాదె ఉషాలత రాంబాబు నామినేషన్ దాఖలు చేశారు. బిజెపి మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు ముఖ్యఅతిథిగా పాల్గొని బిజెపి సర్పంచ్ అభ్యర్థి నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే ధర్మారావు మాట్లాడుతూ బిజెపి పార్టీ సర్పంచ్ అభ్యర్థి గాదె ఉషాలత రాంబాబు ను గ్రామస్తులు, మహిళలందరూ కలిసి భారీ మెజార్టీతో గెలిపించాలని, దేశ ప్రధాని నరేంద్ర మోడీ ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు అందజేస్తున్నారన్నారు. కరోనా సమయంలో ఉచితంగా వ్యాక్సిన్ అందజేసి ప్రజల ప్రాణాలను కాపాడారన్నారు. రైతులకు ప్రతి ఏటా పీఎం కిసాన్ ద్వారా డబ్బులను పెట్టుబడి కోసం అందజేస్తున్నారన్నారు. సర్పంచ్ గా గెలిపించిన తర్వాత చిల్లంచర్ల గ్రామం కోసం రెండు వాటర్ ట్యాంకులు, సైడ్ డ్రైనేజీ కాలువలు, ప్రజల ఆరోగ్యం కాపాడడం కోసం అంబులెన్స్, చిల్లంచర్ల చెరువును మినీ ట్యాంక్ బండ్, గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని సర్పంచ్ అభ్యర్థి ఉషాలత అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు రాంబాబు, భాస్కర్, గంగాధర జనార్ధన్, తప్పట్ల రాములు, సాయికుమార్, హరికిషన్ తదితరులు పాల్గొన్నారు

# గాలివారిగూడెం గ్రామ సర్పంచ్ అభ్యర్థి గా నామినేషన్ వేసిన నారెడ్డి కవిత సుదర్శన్ రెడ్డి



మహబూబాబాద్ జిల్లా తెలుగు గళం మరిపెడ మండలం గాలివారిగూడెం గ్రామానికి చెందిన నారెడ్డి కవిత సుదర్శన్ రెడ్డి బిఆర్ స్ పార్టీ అభ్యర్థి గా సర్పంచ్ ఎన్నికల బరిలో నామినేషన్ సమర్పించి, నా ఎన్నికకు గ్రామ ప్రజల మద్దతు ఇవ్వవలసిందిగా కోరుతూ అత్యధిక మెజార్టీతో గెలిపించాలని తెలియజేస్తూ ఈసందర్భంగా గ్రామ ప్రజలను ఉద్దేశించి బి ఆర్ స్ పార్టీ అభ్యర్థి కవిత సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ మన గ్రామ ప్రజల ఆశీస్సులతో గ్రామ సర్పంచ్ పదవికి నామినేషన్ దాఖలు చేయడం జరిగిందని ఈ సందర్భంగా తెలియజేస్తూ గ్రామ అభివృద్ధిలో తనకు అవకాశం ఇవ్వాలని కోరుతూ గ్రామం లో ని పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటూ, కొన్ని సంవత్సరాలుగా మన గ్రామ అభివృద్ధి లో పాలు పంచుకుంటూ గ్రామ ప్రజల అందరితో మమేకమై ఉంటూ ప్రజల కష్ట సుఖాలలో ఉంటూ వారికి ఏ ఆపద వచ్చినా నా వంతు సహాయ సహకారాలు అందిస్తూ వస్తున్నానని అలాగే గాలివారిగూడెం గ్రామ సర్పంచిగా నాకు అవకాశం ఇవ్వాల్సిందిగా గ్రామ ప్రజలందరూ కోరుతూ వారి ఆశీస్సులతో ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలనిఈ రోజు నామినేషన్. పత్రాలు సమర్పించడం జరిగిందని గ్రామ అభివృద్ధి యువతతో జరగాలని అలాంటిది గ్రామ ప్రజలు ఒకసారి అవకాశం ఇవ్వాలని ఈ సందర్భంగా తెలియజేస్తూ గ్రామ ప్రజలందరూ అభివృద్ధికి ఓటు వేసి గెలిపించాలని ఈ సందర్భంగా గ్రామ ప్రజలందరికీ తెలియజేశారు ఇట్టి నామినేషన్ కార్యక్రమంలో గ్రామ ప్రజలు యువతి యువకులు పెద్ద ఎత్తున పాల్గొని మద్దతు ప్రకటించారు.

# బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం చేసిన ఎండీ బషీర్

తెలుగు గళం జనగామ జనగామ జిల్లా జఫర్గడ్ మండలం లోని తమ్మడపల్లి జి గ్రామ పంచాయతీ కారోబార్ రాపర్తి నవీన్ గారి తండ్రి కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు రాపర్తి చంద్రయ్య గారు ఇటీవల మరణించగా ఈ రోజు వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి %ఽ%మాజీ శాసన సభ్యులు డాక్టర్ రాజయ్య ఆదేశానుసారం రూ 3000 ఆర్థిక సాయం చేసిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు వారితో పాటు మండల యూత్ అధ్యక్షులు మారపెల్లి కర్ణాకర్ పార్టీ అధ్యక్షులు మారపెల్లి కుమార్ పార్టీ సీనియర్ నాయకులు వేల్పుల యాదగిరి కుక్కల సారాయ్య ఎండీ కాశీం ఎండీ యాకుబ్, కొంతం నాగేష్, గిరాగని కుమార్, దిడ్డి ఏళ్ళుస, ఎండీ కాజా, కూరపాటి రాజు మందపురి రాజు, కాసరబోయిన కుమార్, ఉపేందర్ యూత్ నాయకులు ఎండీ రియాజ్ కొంతం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



# సిఐటియు తెలంగాణ రాష్ట్ర మహాసభల జయప్రదం చేయండి

**- వాల్ పోస్టర్ యాచారం మండల కేంద్రంలో విడుదల**



తెలుగు గళం యాచారం రాజీ లేని పోరాటాలే కార్మిక వర్గ హక్కులకు అండ కార్మికులను బానిసలుగా మార్చే లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా దీర్ఘకాల పోరాటాలు. భూపాల్ కార్మిక వర్గం రాజీలేని పోరాటాల ద్వారా మాత్రమే తమ కార్మిక వర్గ హక్కులను కాపాడుకోగలరని ఆ దిశగా కార్మిక వర్గానికి అండగా సిఐటియు నిలుస్తుందని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ గారు అన్నారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ గారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక వర్గం పెట్టుబడుదారులు, యాజమాన్యాలకు వ్యతిరేకంగా సమరశీల పోరాటాలకు సిద్ధపడినప్పుడే తమ హక్కులను కాపాడుకోగలరని అన్నారు. ఆధునిక ప్రభుత్వాలు యాంత్రికీకరణ పేరుతో కార్మికుల ఉపాధిని కొల్లగొట్టి, శ్రమదోపిడిని కొనసాగించి, జీవన ప్రమాణాలను తగ్గిస్తున్నాని విమర్శించారు. సంపద సృష్టికర్తలకు సంపదపై అధిపత్యం దక్కే విధంగా సిఐటియు పోరాడుతుందని అన్నారు. సిఐటియు చేసే రాజీ లేని పోరాటాల వల్లే కేంద్ర ప్రభుత్వం సిఐటియుపై ఉక్కు పాదం మోపుతున్నదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఎన్ని నియంతృత్వాలు, నిర్బంధాలు పెట్టినా, కార్మిక వర్గ హక్కులకు అండగా ఉండటంలో సిఐటియు ఎప్పుడూ ముందుంటుందని అన్నారు. స్వదేశీ, విదేశీ కార్పొరేట్ శక్తులకు కార్మిక వర్గ సంపదను ధారపోసేందుకు తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్ల కు వ్యతిరేకంగా దీర్ఘకాల పోరాటాలు చేయనున్నట్లు తెలిపారు. కార్మిక వర్గాన్ని ఐక్యం కానీయకుండా ఆర్థిక, సామాజిక దోపిడీ కొనసాగించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్ లు ప్రజాస్వామ్య విరుద్ధమని అన్నారు. సులభతర వాణిజ్యం పేరుతో ప్రపంచ పెట్టుబడదారి విధానానికి స్వదేశీ కార్మిక వర్గ హక్కులను పణంగా పెడతామంటే సిఐటియు చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. అన్ని రంగాల కార్మికుల సమస్యలపై డిసెంబర్ 7, 8, 9 తేదీలలో తెలంగాణ రాష్ట్ర 5వ మహాసభల్లో చర్చించి కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వానికి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రుద్ర కుమార్, ఎం చంద్రమోహన్, మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఎర్ర అశోక్, సిఐటియు జిల్లా కోశాధికారి జి కవిత, జిల్లా ఉపాధ్యక్షులు జగదీష్, కిషన్, వీరయ్య, స్వప్న, ఎన్ రాజు, దేవేందర్, రామ్మోహన్ జిల్లా సహాయ కార్యదర్శి సిహెచ్ ఎల్లేష్, పెంటయ్య, సిఐటియు యాచారం మండల కన్వీనర్ ఎస్ చందు నాయక్, పార్వతి తదితరులు పాల్గొన్నారు

# సజావుగా పంచాయతీ ఎన్నికలు

**- షాద్ నగర్ ఏసిపి ఎస్ లక్ష్మీనారాయణ**

**- నామినేషన్ల ఉపసంహరణ సందర్భంగా పలు గ్రామాల పర్యటన**



తెలుగు గళం షాద్ నగర్ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికలలో భాగంగా పంచాయతీ ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు గ్రామాల్లో పూర్తిస్థాయిలో భారీ బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు షాద్ నగర్ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసిపి) ఎస్ లక్ష్మీనారాయణ స్పష్టం చేశారు. బుధవారం ఫరుక్ నగర్ మండలం భీమవరం క్లస్టర్ ను ఎసిపి సందర్శించారు. నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ గురించి ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ నిశాంత్ కుమార్ ను అడిగి తెలుసుకున్నారు. అయ్యవారిపల్లి సర్పంచ్ ఏకగ్రీవ విషయాన్ని అడిగి తెలుసుకోగా మిగతా వివరాలను కూడా వారి నుండి సేకరించారు. ఈ సందర్భంగా అక్కడ మీడియాతో మాట్లాడుతూ.. నామినేషన్ల ప్రక్రియ ముగిసింది కాబట్టి ఇక జరగబోయే ఎన్నికల సందర్భంగా ప్రచారం తదితర ఎన్నికల విషయంలో పోలీసులు పూర్తిస్థాయిలో బందోబస్తు ఏర్పాటు చేశారని గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటామని ఏసీపీ లక్ష్మీనారాయణ వెల్లడించారు. స్థానిక పోలీసులతో పాటు ప్రత్యేక పోలీసు బలగాలు కూడా మోహరించి ఉన్నాయని ఎన్నికలు సజావుగా జరిపేందుకు పూర్తి ప్రణాళిక చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. సున్నితమైన గ్రామాలపై పోలీస్ నజర్ ఉంటుందని తెలిపారు. ఎన్నికల్లో శాంతిభద్రతలకు వివాదం కల్పిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని లక్ష్మీనారాయణ హెచ్చరించారు.

# పార్టీలు మార్చే నాయకులకు బుద్ధి చెప్పడానికే బరిలోకి-సర్పంచ్ అభ్యర్థి బషీరా-బషీర్



తెలుగు గళం న్యూస్ జఫర్ఘడ్ జనగామ జిల్లా జఫర్ఘడ్ మండలం తమ్మడపల్లి (జి) గ్రామంలో సర్పంచ్ అభ్యర్థిగా బరిలో నిలిచిన బిఆర్ఎస్ బలపరచిన అభ్యర్థి ముహమ్మద్ బషీరా బషీర్ మాట్లాడుతూ..పార్టీ మారి ప్రజలను మోసం చేసే రాజకీయ నాయకులకు ప్రజాస్వామ్య పాఠం చెప్పడానికే తాము పోటీ చేస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వ కాలంలో ప్రజలకు కనిపించిన ప్రతినిధులే ఇప్పుడు మరో పార్టీ జెండా ఎత్తుకుని మళ్లీ పోటీ చేయడం ఎంతో బాధాకరమని ఆయన విమర్శించారు. ప్రత్యేకంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి బిఆర్ఎస్ తరఫున గెలిచి తరువాత కాంగ్రెస్ పార్టీలో చేరడం ప్రజల విశ్వాసానికి ద్రోహమని పేర్కొన్నారు. "పెద్ద నాయకులు పార్టీలు మారుతుంటే, కింది స్థాయి కార్యకర్తలకు పోటీ చేసే అవకాశం దక్కడం ఒక విధంగా ప్రజాస్వామ్య విజయం"అని బషీర్ అన్నారు. తాము ఎల్లప్పుడూ గ్రామ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేస్తామని హామీ ఇచ్చిన ఆయన, ప్రత్యర్థి కార్పొరేట్ బిజినెస్‌మెన్ కావడంతో ప్రజలకు అందుబాటులో ఉండే అవకాశమే లేదని వ్యాఖ్యానించారు. గ్రామంలో ఇంకా అనేక అంతర్గత సమస్యలు ఉన్నాయని, వాటి పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. విద్యార్థిదశ నుంచే తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమాల్లో పాల్గొని, ఆత్మాహుతికి కూడా ప్రయత్నించానని ఆయన గుర్తుచేసుకున్నారు. గ్రామాభివృద్ధి పై ఉన్న తమ ఆశయాలను నెరవేర్చేందుకు తమ్మడపల్లి జి ప్రజలు తనను ఆశీర్వదించి గెలిపించాలని ముహమ్మద్ బషీర్ విజ్ఞప్తి చేశారు

# మోదీ సలహా విపక్షాలు పాటిస్తాయా

'ఇక్కడ శీతాకాలానిదే విజయం. అధికార సోపానాల మంచు సామ్రాజ్యాలకోసం పోటీపడాలంటే ఇక్కడ రక్తం చల్లపడాలి..' అని ఒక కవి రాసినట్లు బిహార్ ఎన్నికల తర్వాత ప్రారంభమైన పార్లమెంటు సమావేశాలు చాలా స్తబ్దంగా జరుగుతున్నాయి. ఇదే సమయంలో దేశ రాజధానిని, పొరుగు ప్రదేశాలను గజగజా వణికిస్తున్న చలి గాడ్పులు తీవ్రమవుతున్నాయి. మరోవైపు చలితో పోటీపడుతున్న వాయు కాలుష్యం మరింత దట్టమై ఊపిరితిత్తుల్లోకి దూసుకుపోయి శ్వాసించడాన్ని దుర్భరంగా మారుస్తోంది. కళ్ల ముందు పొగమంచు కమ్ముకుని ఉదయాలూ, సాయంత్రాలూ కారుమబ్బుల మధ్య ప్రయాణిస్తున్నట్టు అనిపించే వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి. ఊపిరి పీల్చడానికి కష్టపడుతూనే కళ్లు మండుతున్నా ఢిల్లీ వాసులు తమ ప్రయాణాలు సాగిస్తున్నారు. 'కాలుష్య నివారణకు మీరేం చేస్తున్నారో చెప్పండి..' అని సుప్రీంకోర్టు కేంద్రంపై మరోసారి మండిపడింది! చాలా మంది మనుషుల మాదిరే సుప్రీంకోర్టుకూ జ్ఞాపకశక్తి తక్కువేనేమో? గత ఏడాది సరిగ్గా ఇవే రోజుల్లో వాయు కాలుష్యం నివారణ విషయమై కేంద్రాన్ని సుప్రీంకోర్టు గట్టిగా నిలదీసింది. న్యాయమూర్తులు మారుతున్నారు కాని ప్రజలకు న్యాయం మాత్రం గగన కుసుమంగా మారింది సుమా! ఈ ఏడాది పార్లమెంట్ శీతాకాల సమావేశాలూ ప్రభుత్వ, ప్రతిపక్షాల తీరుతెన్నుల్లో మార్పేమీ లేదన్న విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. గత ఏడాది శీతాకాల సమావేశాల్లో ఉభయ సభల్లో ప్రశ్నోత్తరాల సమయం దాదాపు పూర్తిగా స్తంభించిపోయింది. మణిపూర్‌లో అల్లర్లు తదితర అంశాలపై చర్చకు అనుమతించలేదంటూ అప్పటి రాజ్యసభ చైర్మన్ దన్‌ఖడ్‌ను తొలగించేందుకు ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానాన్ని సైతం ప్రవేశపెట్టాయి. ప్రతిపక్షాల అవిశ్వాస తీర్మానాన్ని అధికార పక్షం తిరస్కరించింది. అయితే ఆ తర్వాతి రోజుల్లో అదే చైర్మన్‌పై ప్రభుత్వమే విశ్వాసాన్ని కోల్పోయి ఆయనను ఇంటికి పంపిస్తుందని కానీ, ఈ ఏడాది శీతాకాల సమావేశాలు కొత్త చైర్మన్ ఆధ్వర్యంలో జరుగుతాయని కాని నాడు ఎవరూ ఊహించలేదు. గత ఏడాది హరియాణా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఘనవిజయం తర్వాత సమధికోత్సాహంతో ఉన్న భారతీయ జనతా పార్టీ ప్రతిపక్షాలను పూచికపుల్లల్లా పరిగణించింది. ఈ ఏడాది కూడా బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో కనీవినీ ఎరుగని విజయం తర్వాత జరుగుతున్న ఈ శీతాకాల సమావేశాల్లో పాలకపక్షం సహజంగానే విజయోత్సాహంతో ఉన్నది. మరి మరింత బలహీనపడిన ప్రతిపక్షాలను బీజేపీ లెక్కచేస్తుందని మాత్రం ఎవరనుకుంటారు? ఎన్నికల్లో విజయాలు, చట్టసభల్లో సంఖ్యాబలం మాత్రమే ఒక పార్టీ జయాపజయాలకు కొలమానం కదా. ప్రధానమంత్రి నరేంద్రమోదీ శీతాకాల సమావేశాల తొలిరోజే విపక్షాలపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. 'బిహార్ ఎన్నికలకు ముందు దేశంలో తమకు అనుకూల వాతావరణాన్ని సృష్టించుకునేందుకు ప్రతిపక్షాలు వర్షాకాల సమావేశాలను ఉపయోగించుకోవాలని అనుకున్నాయని, ఇప్పుడు ఓటమి తర్వాత తమ నిరాశా నిస్పృహలను వ్యక్తం చేసేందుకు శీతాకాల సమావేశాలను ఉపయోగించుకోవాలని అనుకుంటున్నాయని' ఆయన వ్యంగ్యంగా విమర్శించారు. ప్రతిపక్షాలు తమ వ్యూహాన్ని, వైఖరిని మార్చుకోవాలని, కావాలంటే తాను అవి తమ పనితీరు మెరుగుపరుచుకునేందుకు వాటికి సలహాలు ఇస్తానని కూడా ఆయన అన్నారు. డ్రామాలు, నినాదాలకు పార్లమెంటు వెలుపల అనేక వేదికలు ఉన్నాయని, పార్లమెంట్ను ఎట్టి పరిస్థితులలోను వాటికి వేదికగా చేసుకోకూడదని ఆయన హితవు చెప్పారు. నిజానికి ఆపరేషన్ సిందూర్ విషయంలో ఇంటా బయటా అనేక ఒత్తిళ్లను ఎదుర్కొన్న మోదీ సర్కార్‌ను గత వర్షాకాల సమావేశాల్లో ప్రతిపక్షాలు నిర్దాక్షిణ్యంగా నిలదీశాయి. బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పై కూడా అవి గందరగోళం సృష్టించాయి. ప్రతిరోజూ పార్లమెంట్ ఆవరణలోనూ, ఉభయ సభల్లోనూ ప్లకార్డుల ప్రదర్శన, నినాదాలు చేయడం ద్వారా మోదీ సర్కార్‌ను ఆత్మరక్షణలో పడవేసినట్లు ప్రతిపక్షాలు భావించాయి. కేవలం ఆపరేషన్ సిందూర్‌పై మాత్రమే రెండున్నర రోజులు చర్చించిన ఆ సమావేశాలు అంతకు మించి ఒక్క రోజు కూడా సాగకపోయినప్పటికీ ప్రభుత్వం ఉభయ సభల్లోనూ 15 ముఖ్యమైన బిల్లులను గందరగోళం మధ్యే ఆమోదించుకోగలిగింది. వర్షాకాల సమావేశాల తర్వాత జరిగిన బిహార్ ఎన్నికల్లో ప్రతిపక్షాలు విజయం సాధించలేకపోవడం ఆశ్చర్యకరమైన విషయమే. ఆపరేషన్ సిందూర్‌ను ఆకస్మికంగా నిలిపివేయడంపై విపక్షాల విమర్శలను బిహార్ ప్రజలు పట్టించుకోలేదా? పెద్ద ఎత్తున ఓటర్లను తొలగించేందుకు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను చేపట్టారని తీవ్ర రభస చేసిన విపక్షాలను ఓటర్లు ఎందుకు విస్మరించారు? పార్లమెంట్‌లో ప్రతిపక్షాలు లేవనెత్తిన అంశాలు ప్రజలపై ప్రభావం చూపించడం లేదా? పార్లమెంట్ లోపలే కాదు, బయట కూడా 'సర్'పై విపక్షాలు నిరసన యాత్రలు, సభలు నిర్వహించాయి. అయినా ఎన్నికల ఫలితాలు మాత్రం వారు ఊహించని విధంగా వచ్చాయి. అయినప్పటికీ శీతాకాల సమావేశాలు ప్రారంభమైన మొదటి రోజు నుంచే 'సర్'పై విపక్షాలు ఉభయ సభలను స్తంభింపచేయడం మొదలుపెట్టాయి. ఢిల్లీలో ఎర్రకోట వద్ద బాంబు పేలుళ్లపై చర్చ జరగాలని డిమాండ్ చేశాయి పార్లమెంట్ ఆవరణలో సోనియాగాంధీ, రాహుల్, ప్రియాంకతో సహా ప్రతిపక్ష నేతలు అందరూ నిరసన ప్రదర్శన నిర్వహించారు. మోదీ సర్కార్ వీటన్నింటినీ మాత్రం లెక్కచేయకుండా మొదటి రోజునుంచే గందరగోళం మధ్య బిల్లులను ఆమోదింపచేసుకోవడం మొదలుపెట్టింది. చివరకు 'సర్'పై నిర్దిష్టంగా కాకపోయినా స్థూలంగా ఎన్నికల సంస్కరణలపై వచ్చే వారం చర్చకు ప్రభుత్వం అంగీకరించింది. చర్చించినంత మాత్రాన ఏమి జరుగుతుంది? సవరణ పేరుతో దళితులు, ఓబీసీలు, అణగారిన వర్గాల ఓటర్లను తొలగిస్తున్నారని విపక్ష నేతలు చేసే ఆరోపణలను ప్రభుత్వం అంగీకరిస్తుందా? ఎన్నికల సంఘం ప్రధానాధికారి జ్ఞానేశ్ కుమార్ బీజేపీ ఏజెంట్‌లా వ్యవహరిస్తున్నారన్న విపక్షాల విమర్శలకు ప్రభుత్వం ఏ విధంగా ప్రతిస్పందిస్తుంది? ఓటర్ల జాబితా సవరణను వేగవంతం చేయడంతో భయాందోళనలను, పని ఒత్తిళ్లను ఎదుర్కోలేక ఒక్క బెంగాల్‌లోనే నలుగురు బీఎల్ఓలతో సహా దాదాపు 39 మంది మరణించారని ప్రతిపక్షాలు చెప్పిన విషయాల్లో వాస్తవాలు ఉన్నాయని కేంద్రం ఏకీభవిస్తుందా? సర్‌పై చర్చకు ముందు ప్రభుత్వం ఈ నెల 8, 9 తేదీల్లో వందేమాతరం లిఖించి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పార్లమెంట్‌లో చర్చను నిర్వహించడం ఈ శీతాకాల సమావేశాల్లో చెప్పుకోదగ్గ విశేషం. బంకించంద్ర ఛటర్జీ రచించిన ఈ గీతాన్ని రవీంద్రుడు తొలుత కాంగ్రెస్ సదస్సులో ఆలపించారు. తదాది ఆ గీతం భారత స్వాతంత్ర్య పోరాట చైతన్య గీతమై పల్లవించింది. వందేమాతరం ఆలపించినందుకే నిజాం ప్రభుత్వం పీవీ నరసింహారావుతో సహా పలువురు విద్యార్థులను ఉస్మానియా యూనివర్సిటీ నుంచి బహిష్కరించింది. నిజానికి స్వాతంత్ర్య పోరాటం నిర్వహించిన చరిత్ర తమకు ఉన్నదని చెప్పుకుంటున్న కాంగ్రెస్ వందేమాతరం శతాబ్దిన్నర ఉత్సవాలను తానే ఘనంగా నిర్వహిస్తూ ప్రజల్లోకి వెళ్లాల్సిన విలువైన సందర్భమది. కానీ కాంగ్రెస్‌కు దక్కాల్సిన ఘనతను బీజేపీయే ఇప్పుడు దక్కించుకోవడమే కాక జాతీయవాద భావాలను పురికొల్పి తన రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకునేందుకు పెద్ద ఎత్తున సంకల్పించింది. పైగా మతశక్తులను బుజ్జగించేందుకు వందేమాతరంలో కొన్ని చరణాలను తొలగించడం ద్వారా దేశ విభజన బీజాలను కాంగ్రెస్ నాటిందని మోదీతో పాటు బీజేపీ నేతలు గుప్పించిన ఆరోపణలు కాంగ్రెస్‌ను మరింత ఆత్మరక్షణలో పడవేశాయి. ఏ చారిత్రక సందర్భంలో తాము అలా చేయవలసి వచ్చిందో, రాజ్యాంగ సభ దాన్ని ఎలా ఆమోదించిందో కాంగ్రెస్ సమర్థంగా సమర్థంగా వివరించలేకపోతున్నదా అన్న భావన కలుగుతోంది. ఇప్పుడు వందేమాతరంపై జరిగే చర్చను కూడా బీజేపీ పార్లమెంట్లో తమకే పూర్తిగా అనుకూలంగా, కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా మార్చేందుకు కచ్చితంగా ప్రయత్నిస్తుంది. ఇలాంటి విషయాల్లో కాంగ్రెస్‌కు కాలం అనుకూలంగా లేదన్న వాస్తవాన్ని ఆ పార్టీ నేతలు అంగీకరించలేకపోతున్నారు. పార్లమెంట్ సమావేశాల సమయంలోనే డిసెంబర్ 4, 5 తేదీల్లో రష్యా అధ్యక్షుడు పుతిన్ భారత్‌లో రెండు రోజులు పర్యటించనున్నారు. ఈ సందర్భంగా రష్యాతో కీలకమైన సైనిక, వాణిజ్య ఒప్పందాలపై సంతకాలు చేయడం మోదీ సర్కార్‌కు మరింత ఆత్మస్థైర్యం కలిగించే విషయం. రష్యాతో సంబంధాలను తగ్గించుకోవాలని అమెరికా తీవ్ర ఒత్తిడి చేస్తున్న సమయంలో ఆ దేశంతో ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింతగా పెంపొందించుకునేందుకు భారత్ నిర్ణయించుకోవడం ఒక కీలక పరిణామం, సందేహం లేదు. పుతిన్ పర్యటననూ మోదీ తన ప్రతిష్ఠను పెంచుకునేందుకు ఆయన సద్వినియోగం చేసుకుంటారనడంలో సందేహం లేదు. ఈ మొత్తం పరిణామాల క్రమంలో కాంగ్రెస్, ప్రతిపక్షాలు తమ భావి కార్యాచరణను ఏ విధంగా నిర్ణయించుకోవాలన్న విషయమై అయోమయంలో ఉన్నాయని చెప్పక తప్పదు. పార్లమెంటులో నినాదాలు చేస్తూ నిరసనలు వ్యక్తం చేయడం వల్ల సాధించేదేమీ ఉండదు. విపక్షాలను ఉద్దేశించి మోదీ చేసిన వ్యాఖ్యలను సలహాలుగా అవి ఎందుకు పాటించకూడదు? అందులో తప్పేమీలేదు. ప్రతిపక్షాలే కాదు, మన ప్రజాస్వామ్యం సుస్థిరంగా, క్షేమంగా ఉండాలని, ప్రజలు చైతన్యవంతులు కావాలని కోరుకునేవారంతా తమ పోరాట రూపాల్ని మరోసారి సమీక్షించుకోవాల్సిన అవసరం ఉన్నదేమో!

సంపాదకీయం

## గ్రామాభివృద్ధి.. మన చేతుల్లోనే!

భారతీయ ప్రజాస్వామ్యంలో అత్యంత బలమైన పునాది గ్రామం. గ్రామం బలపడితేనే దేశం బలపడుతుంది. ఈ గ్రామ పాలనలో అత్యంత ప్రధానమైనవి గ్రామపంచాయతీ ఎన్నికలు. చట్టసభల ఎన్నికల కంటే సాధారణంగా చిన్నవి అనుకున్నా, నిజంగా చూసుకుంటే మన దైనందిన జీవితంపై ప్రతిరోజూ ప్రభావం చూపేది గ్రామస్థాయి పరిపాలనే. నీరు, రహదారులు, వీధి దీపాలు, చెత్త నిర్వహణ, పాఠశాల పరిస్థితే కాకుండా, సంక్షేమ పథకాలు, అభివృద్ధి ప్రణాళికలు.. ఇవన్నీ నిర్ణయించే బాధ్యత గ్రామపంచాయతీలోని సర్పంచ్‌దే. అందుకే ఈ ఎన్నికల్లో ఓటు వేయడం 'హక్కు' మాత్రమే కాదు, భవిష్యత్తును నిర్మించే బాధ్యత కూడా. ఈ నేపథ్యంలో ప్రతి ఓటరు ఏ విషయాలు ఆలోచించి ఓటు వేయాలి సర్పంచ్ అభ్యర్థిని ఎంపిక చేసే ముందు ఎలాంటి అంశాలను పరిశీలించాలి అనే అంశంపై లోతైన చర్చ చేసుకోవాలి. ఎన్నికల ముందు అభ్యర్థులు హామీల వరద పారిస్తారు. అప్పుడు ఓటరు మాయ మాటలకు లోనుకాకుండా ఒక విషయాన్ని గుర్తుంచుకోవాలి, 'ఇప్పటి వరకు అభ్యర్థి ఏం చేశారు' అనే ప్రశ్నే అత్యంత ప్రధానమైనది. గతంలో పదవిలో ఉన్న అభ్యర్థి అయితే అతని పనులు పరిశీలించాలి. కొత్త అభ్యర్థి అయితే గ్రామం కోసం చేసిన సామాజిక సేవలు చూసుకోవాలి. వాగ్దానాల జాబితా పొడవుండొచ్చు, కానీ హామీలను సాధించే, నెరవేర్చే కృతనిశ్చయం అభ్యర్థి కలిగి ఉండాలి. అభివృద్ధి అనేది కాగితంపై గీసిన ప్రణాళిక కాదు, అది రహదారుల రూపంలో, పరిశుభ్రమైన వీధుల రూపంలో, పారదర్శక పాలన రూపంలో కనిపించాలి. సర్పంచ్ ఒక పదవి మాత్రమే కాదు, గ్రామానికి చెవి, కళ్లు, హృదయం. కాబట్టి అభ్యర్థి వ్యక్తిత్వం అత్యంత కీలకం. నిజాయితీ ఉన్నవాడా ప్రజల మాట వినగలడా వివాదాలను శాంతితో పరిష్కరించగలడా? అహింసను నమ్ముతాడా అని ఆలోచించాలి. గ్రామ రాజకీయాలు ఎక్కువగా వ్యక్తిగత విభేదాలపై తిరుగుతాయి. అలాంటి సమయంలో నాయకుడు కోపానికి లోనుకాకుండా, ప్రజల మధ్య సమైక్యతను పెంచే వాడై ఉండాలి. చాలా గ్రామాల్లో 'మా ఇంటివాళ్లే రావాలి', 'అది మా వర్గం', 'మా గోత్రం' అనే భావాలతో ఓటు వేయడం సంప్రదాయం అయిపోయింది. కానీ గ్రామ అభి వృద్ధికి ఈ భావజాలం అడ్డంకి. సర్పంచ్ అభ్యర్థిని ఎంచుకోవడంలో చూడవలసింది, అభ్యర్థి సామర్థ్యం, జ్ఞానం, దూరదృష్టి మాత్రమే.. ప్రజలు కుటుంబ సంబంధాల్ని పక్కనబెట్టి సమర్దవంతుడైన అభ్యర్థిని ఎన్నుకుంటేనే గ్రామ పరిపాలనలో నూతన మార్పులు వస్తాయి.. సర్పంచ్‌కు ఉన్నత విద్య తప్పనిసరి కాకపోయినా, పనుల నిర్వహణ, ప్రణాళికలు రూపొందించడం, డేటా అర్థం చేసుకోవడం, ప్రభుత్వ పథకాలపై అవగాహన ఇవన్నీ అతనికి తప్పనిసరైన నైపుణ్యాలు. అభ్యర్థి వద్ద ఇవి ఉన్నాయా ప్రభుత్వ పథకాల వినియోగం ఎలా చేయాలో తెలుసా? బడ్జెట్‌పై అవగాహన ఉందా టెండర్లు, నిర్మాణ పనులు, పారదర్శక ఖర్చులపై అవగాహన ఉందా? విద్య ఉన్నవారు మాత్రమే మంచి నాయకులు అవుతారు అనేది నిజం కాకపోయినా, తెలివితేటలు, నేర్చుకోవాలన్న మనస్తత్వం మాత్రం ఉండాలి. గ్రామ సమస్యలకు క్రియాత్మక పరిష్కార ప్రణాళికలు ఉన్నవాడై ఉండాలి. కేవలం 'తీర్చేస్తాం', 'చేస్తాం' అంటూ సభలలో చెప్పడం సరిపోదు.. ఎలా చేస్తాడు ఏ నిధులతో చేస్తాడు ఏ సమయంలో పూర్తి చేస్తాడు అనే ప్రశ్నలకు సమాధానం చెప్పగల అభ్యర్థినే ప్రజలు ఎన్నుకోవాలి. గ్రామ పంచాయతీ నిధులు పెద్దవి కావచ్చు, చిన్నవి కావచ్చు... కానీ వాటిపై పారదర్శకత లేకపోతే అవినీతి వేళ్లూనుకుంటుంది. అభ్యర్థి మనకు నిర్ధారించవలసిన అంశాలు, ప్రతి రూపాయి ఖర్చులో పారదర్శకత, పనుల నాణ్యత పర్యవేక్షణ. గ్రామసభ సమావేశాలు క్రమం తప్పకుండా నిర్వహించడం, పారదర్శకతను పాటించే నాయకుడే నిజమైన ప్రజా నాయకుడు. సంప్రదాయాలు, పండుగలు, సమాజ కార్యక్రమాల్లో గ్రామాన్ని ఒక్కటిగా ఉంచే నాయకుడే గ్రామ అభివృద్ధికి దారితీయగలడు. ఎన్నికల సమయంలో చాలా చోట్ల డబ్బు, బహుమతులు, విందులు ఇవ్వడం సాధారణం. అవి తీసుకుని ఓటు వేయడం మన వ్యక్తిగత ప్రయోజనం అనిపించినా, గ్రామ భవిష్యత్తుకు అది పెద్ద నష్టం. డబ్బు ఇచ్చే నాయకుడు పదవిలోకి వెళ్లాక మరింత డబ్బు సంపాదించడానికే ప్రయత్నిస్తాడు. అందువల్ల ఓటర్లు 'ఈరోజు ప్రయోజనం' కన్నా 5 సంవత్సరాల అభివృద్ధి గురించి ఆలోచించాలి. గ్రామాభివృద్ధి అనేది మాంత్రికం కాదు, అది సమష్టి కృషి. కానీ ఆ కృషికి దిశ నిచ్చేది, గ్రామాన్ని ముందుకు నడిపేది సర్పంచ్ మాత్రమే. మంచి నాయకుడు ఉంటే గ్రామం అద్భుత మార్పులు చూడగలదు. చెడు నాయకుడు ఉంటే గ్రామం సంవత్సరాల పాటు వెనుకబడిపోవచ్చు. అందుకే ఓటు వేయడానికి ముందు ఓటరు నిశితంగా ఆలోచించాలి. గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఓటు వేయడం అంటే కేవలం ఓటు చెల్లించడం కాదు. మన గ్రామ భవిష్యత్తుకు ఓ నిర్ణయం తీసుకోవడం. మన పిల్లల రేపటి పరిస్థితులు, మన జీవన ప్రమాణాలు, గ్రామ అభివృద్ధి.. ఇవన్నీ మన ఓటుతోనే నిర్ణయించబడతాయి. అందుకే జాగ్రత్తగా ఆలోచించి, అభ్యర్థి పనులు చూసి నిర్ణయించి, సామర్థ్యాన్ని పరిశీలించి మాత్రమే సర్పంచ్ అభ్యర్థిని ఎన్నుకోవాలి. గ్రామం అభివృద్ధి చెందితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది, రాష్ట్రం అభివృద్ధి చెందితేనే దేశం బలపడుతుంది. ఆ బలం మన చేతుల్లో ఉన్న ఓటుతో ప్రారంభమవుతుంది.

# దివ్యాంగులకు చేయూత మానవ ధర్మం

అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం ప్రతి సంవత్సరం డిసెంబరు 3వ తేదీన నిర్వహించబడుతుంది. రాజకీయ, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక పరంగా వికలాంగులు ఎదుగుదలను ప్రోత్సహించేలా ఈ దినోత్సవం ప్రయత్నిస్తుంది. గతంలో యుద్ధాలలో వికలాంగులైన సైనికులు మాత్రమే ప్రతి సంవత్సరము మార్చి 3వ ఆదివారము నాడు వికలాంగుల దినోత్సవము జరుపుకునేవారు. దానిని ఐక్యరాజ్య సమితిలో ఆమోదించి అన్ని రకాలుగా వికలాంగులైన వారందరు ప్రపంచ యావత్తు ఈ వేడుకలను నిర్వహించుకోవాలని ప్రతి సంవత్సరము మార్చి 3వ ఆదివారాన్ని "ప్రపంచ వికలాంగుల దినోత్సవము"గా ప్రకటించబడినది. అలాగే 1981 సంవత్సరాన్ని అంతర్జాతీయ వికలాంగుల సంవత్సరముగా ఐక్యరాజ్య సమితి ప్రకటించటం ఆ సంవత్సరములో ఎన్నో కార్యక్రమాలు రూపొందించడం జరిగింది. వికలాంగులకు సమాన అవకాశాలు, హక్కులు కలిపించి వారందరిని సమాజ అభివృద్ధిలో భాగం చేయాలనే లక్ష్యంతో 1976లో ఐక్యరాజ్య సమితి 1981 సంవత్సరాన్ని అంతర్జాతీయ వికలాంగుల సంవత్సరంగా ప్రకటించింది. అలాగే, 1983 నుండి 1992 వరకు ఐక్యరాజ్య సమితి వికలాంగుల దశాబ్దంగా ప్రకటించింది. ఎన్నో వర్గాల వారికి అనగా కార్మికులకు మేడే - మే 1వ తేదీన, పిల్లలకు చిల్డ్రన్ స్డే నవంబర్ 14వ తేదీన, మహిళలకు ఉమెన్స్ డే మార్చి 8వ తేదీన చివరకు ప్రేమికులకు వాలెంటైన్స్ డే ఫిబ్రవరి 14వ తేదీన ఇలా ప్రతిదానికి ఒక నిర్దిష్టమైన తేది ఉంటే వికలాంగులకు మాత్రం నిర్దిష్టమైన లేది. నాడు కాకుండా మార్చి 3వ ఆదివారం "ప్రపంచ వికలాంగుల దినోత్సవము" జరుపడం వలన ప్రతి సంవత్సరము ఏదో ఒక తేదీన రావడం వలన ఫలాన తేది వాడు వికలాంగుల దినోత్సవము అని గుర్తించ లేకపోవడం జరిగినది. ఈ విషయమై 1994వ సంవత్సరము మొదటి లోనే ఐక్యరాజ్య సమితిలో మరొక పర్యాయం చర్చించి మార్చి 3వ ఆదివారం నాడు జరుపుతున్న "ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని" 1994 నుండి డిసెంబర్ 3వ తేదీనాడు "అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవముగా" జరపాలని ప్రకటించ బడినది. ఆ నాటి నుండి అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవ వేడుకలు ప్రతి సంవత్సరము డిసెంబర్ 3వ తేదీనాడు యావత్తు ప్రపంచములో నిర్వహించ బడుచున్నవి. 1995 వికలాంగుల హక్కుల చట్టం వచ్చినప్పటి నుండి వికలాంగుల సంక్షేమము మరియు అభివృద్ధి కై పలు పథకాలు ప్రవేశ పెట్టబడినవి. వికలాంగుల సమస్యలను పరిష్కరించి వారికి ఆసరానిచ్చి, వారు గౌరవంగా జీవిస్తూ సాధారణ జనజీవనంలో భాగమై అన్ని హక్కులు పొందేలా చూడడంకోసం 1992లో ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో ఈ దినోత్సవం మొదలై,1998 నుండి ప్రతి సంవత్సరం వికాలాంగులకు సంబంధించిన ఒక అంశంతో అన్ని దేశాలు ఈ దినోత్సవాన్ని జరుపుకుంటున్నాయి. ఆంధ్రప్రదేశ్ లో 1981లో ఆంధ్రప్రదేశ్ వికలాంగుల సహకార సంస్థ ఏర్పాటు చేయడం, తరువాత 1983లో వికలాంగుల సంక్షేమ శాఖను ఏర్పాటు చేయడం జరిగింది. వాస్తవానికి ఆంగ్ల భాషలో హ్యాండి క్యాప్ డ్, డిజేబుల్డ్, ఫిసికల్లీ ఛాలెంజ్డ్ అని రకరకాల పదాలు వాడుతున్నా, తెలుగులో అంగ వికలులను "వికలాంగులు" కాకుండా "దివ్యాంగులు"గా పేర్కొనడం సమంజసంగా భావించి, సాధ్యమైనంత వరకూ వికలాంగులు అనే పదం వాడుక భాషలో తీసేసి, అలాగే దివ్యాంగులు పదమే వాడుతున్నారు. సమాజంలోని దివ్యాంగుల పట్ల స్వాభావిక గౌరవం, వ్యక్తిగత స్వయం ప్రతిపత్తి, వివక్షత లేని సమాజం, అవకాశాల సమానత్వం, అవరోధ రహిత వాతావరణం నిర్మాణం కొరకు, దివ్యాంగుల హక్కులకు కలుగ జేయడానికి కేంద్ర ప్రభుత్వం 2016లో దివ్యాంగుల హక్కుల చట్టాన్ని రూపొందించింది. దీన్ని రాష్ట్ర స్థాయిలో అమలు చేయడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. తెలంగాణ రాష్ట్ర దివ్యాంగుల హక్కుల నియమాలు 2018లో రూపొందించారు. ఈ చట్టంలో భాగంగా దివ్యాంగులకు అన్ని రంగాలలో సమానత్వం కల్పించడానికి ప్రత్యేక హక్కులతో పాటు 5% రిజర్వేషన్ కల్పించారు. వారి స్వాలంబనకై తెలంగాణ రాష్ట్రం లో గత తెలంగాణ ప్రభుత్వం ఏ రాష్ట్రంలో లేని విధంగా సుమారు ఏడు లక్షల 30 వేల దివ్యాంగులకు ప్రతి నెల మూడు వేల పదహారు రూపాయలు పెన్షన్లు ఇవ్వడం జరుగుతున్నది. అలాగే వారికి ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో వెళ్లడానికి అవరోధ రహిత వాతావరణం కల్పించుటకు, అన్ని సంస్థల్లో ర్యాంపులు నిర్మాణమే గాక అచట దివ్యాంగులు ఉపయోగించుకునే మూత్రశాలలు, వీల్ చైర్ లు ఏర్పాటు చేయడానికి ఈ చట్టం వీలు కల్పించింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులు ఆర్థిక స్వయం ప్రతిపత్తి సాధించడానికి స్వయం ఉపాధి పథకం కింద 60 శాతం నుంచి 80 శాతం వరకు సబ్సిడీతో రుణాలు మంజూరు చేయడం జరుగుతున్నది. దివ్యాంగులకు వారి కార్యక్రమాలు నిర్వహించడం కొరకు వారికి కావలసిన ఉపకరణాలను అందజేయడం ఉచితంగా అందచేయడం జరుగుతున్నది. ప్రస్తుతం పెరుగుతున్న సాంకేతికను జోడించి అనేక అభివృద్ధి చెందిన ఉపకరణాలను కూడా అందజేయడం జరుగుతున్నది. అలాగే కొవిడ్-19 పరిస్థితుల్లో దివ్యాంగులకు ఇబ్బంది కలగకుండా వారికి కావాల్సిన సేవలు అందజేయడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఒక టోల్ ఫ్రీ నెంబర్ కూడా ఏర్పాటు చేసింది. ఈ టోల్ ఫ్రీ నెంబర్‌కి ఫోన్ చేసిన దివ్యాంగులకు వారికి కావలసిన నిత్యావసర వస్తువులు మందులు ఉపకరణాలు, అలాగే వారికి కావలసిన అనుమతి పత్రాలను అంద జేయడానికి ఈ టోల్ ఫ్రీ సేవలు అందుబాటులోకి తెచ్చారు.

## రాష్ట్రపతులకు ఆదర్శం రాజేంద్రప్రసాద్

ప్రజలు ప్రేమగా, గౌరవంగా 'బాబూ' అని పిలుచుకునే డా.రాజేంద్రప్రసాద్ (1884 డిసెంబర్ 3 -1963 ఫిబ్రవరి 28) భారతదేశపు మొట్టమొదటి రాష్ట్రపతి. 1950 నుండి 1962 వరకు రెండు సార్లు రాష్ట్రపతిగా బాధ్యతలను నిర్వహించాడు. బీహార్ లో ప్రముఖ నాయకునిగా ఎదిగి, భారత జాతీయ కాంగ్రెస్ లో భారత స్వాంతంత్ర్యోద్యమ కాలంలో చేరాడు. మహాత్మాగాంధీ మద్దతుదారునిగా 1931లో జరిగిన ఉప్పుసత్యాగ్రహం, 1941లోజరిగిన క్విట్ ఇండియా ఉద్యమాలలో పాల్గొని జైలుశిక్ష అనుభవించాడు. 1946 ఎన్నికల తరువాత నెహ్రూ మంత్రి వర్గంలో ఆహారం, వ్యవసాయం శాఖకు భారత ప్రభుత్వంలో మంత్రిగా ఉన్నాడు. ఆయన భారత రాజ్యాంగ నిర్మాణ శిల్పి. 1948 నుండి 1950 వరకు భారత రాజ్యాంగ ముసాయిదా తయారీ కోసం ఏర్పరచబడిన సంఘానికి అధ్యక్షుడు. 1951 సార్వత్రిక ఎన్నికల తరువాత మొదటి భారత పార్లమెంటు ఎలక్టోరల్ కాలేజ్ ద్వారా రాష్ట్రపతిగా ఎన్నుకోబడిన నేత.రాజేంద్ర ప్రసాద్ బీహార్ రాష్ట్రంలో శివాన్ జిల్లాలోని జెర్దాయ్ గ్రామంలో 1884లో డిసెంబరు 3 న జన్మించాడు. అతని తండ్రి మహదేవ్ సహాయ్ సంస్కృతం, పర్షియను భాషలలో పండితుడు. తల్లి కమలేశ్వరీ దేవి ఎప్పుడూ రామాయణం నుండి కథలు వివరించేది. ఐదవ ఏటనే పర్షియన్ భాష, హిందీ భాష , అంకగణితం ను నేర్చుకోవడానికి ఒక మౌల్వీ (ముస్లిం పండితుడు) దగ్గరకు పంపించ బడ్డాడు. తరువాత ఛాప్రా ప్రభుత్వ పాఠశాలలో ప్రాథమిక విద్యాభ్యాసం చేసాడు. 12 సంవత్సరాల వయసులోనే రాజ్‌వంశీ దేవిని వివాహం చేసుకున్నాడు. అటు తరువాత విద్యకై పాట్నాలో కె.ఘోష్ పాఠశాలలో చదువుకున్నాడు. ఛాప్రా ప్రభుత్వ పాఠశాలలో చేరి కలకత్తా విశ్వవిద్యాలయ ప్రవేశ పరీక్షలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడై నెలకు రూ.30 ఉపకారవేతనం పొందాడు. 1902లో అతడు కలకత్తా ప్రెసిడెన్సీ కాలేజీలో చేరాడు. మొదట్లో సైన్సు విద్యార్థి. 1904లో కలకత్తా విశ్వవిద్యాలయం నుండి ఎఫ్.ఎ ఉత్తీర్ణుడయ్యాడు. అక్కడే 1905లో మొదటి స్థానంలో గ్రాడ్యుయేషన్ చేసాడు. అతని అధ్యాపకులలో జగదీష్ చంద్రబోసు, ప్రఫుల్ల చంద్ర రాయ్ మొదలగువారు ఉన్నారు. ఆయన మేధాశక్తికి ఒక ఎక్జామినర్ (పరీక్షకుడు) ప్రభావితుడై అతడి పరీక్షా జవాబు పత్రంపై "పరీక్షకుని కంటే పరీక్షితుడు గొప్పవాడు" అనే వ్యాఖ్య రాశాడు.1917లో కలకత్తా విశ్వవిద్యాలయంలో ఆర్థిక శాస్త్రంలో ఎం.ఎ. ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణుడయ్యాడు. బి.ఎల్. ఆ తర్వాత ఎం.ఎల్. పూర్తి చేసి డాక్టరేట్ కూడా పొందాడు. . అన్నతో కలిసి స్వదేశీ ఉద్యమాన్నీ నడిపాడు. అతడు "ద్వాన్ సమాజం" లో క్రియాశీల సభ్యునిగా సేవలందించాడు. అతడు పాట్నా కళాశాలలో1906లో జరిగిన బీహారీ స్టూడెట్స్ కాన్ఫరెన్సు ఏర్పాటులో కీలక పాత్ర పోషించాడు. ఉపాధ్యాయునిగా అనేక విద్యాసంస్థలలో పనిచేసాడు. ఆర్థిక శాస్త్రంలో ఎం.ఎ పూర్తి చేసిన తరువాత అతడు బీహార్ లోని ముజఫర్‌పూర్ లాంగట్ సింగ్ కళాశాలలో ఆంగ్ల అధ్యాపకునిగా చేరాడు. తరువాత ఆ సంస్థకు ప్రధానాచార్యునిగా తన సేవలనందించాడు. తరువాత 1909లో కలకత్తాలోని రిప్పన్ కళాశాలలో న్యాయవాద విద్యను అభ్యసించడానికి గాను ఉద్యోగాన్ని వదిలి వెళ్ళాడు. అతడు ఆ కళాశాలలో న్యాయవాద విద్యను అభ్యసించే సమయంలో కలకత్తా సిటీ కళాశాలలో ఆర్థికశాస్త్ర అధ్యాపకునిగా పనిచేసాడు. 1915 లో "మాస్టర్ ఆఫ్ లా" పరీక్షలకు హాజరై ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణుడై బంగారు పతకాన్ని పొందాడు. 1937లో అలహాబాదు విశ్వవిద్యాలయం నుండి న్యాయ శాస్త్రంలో డాక్టరేట్ డిగ్రీని పొందాడు. 1916 లో, బీహార్, ఒడిషా రాష్ట్రాల హైకోర్టులలో చేరాడు. తరువాత 1917లో అతడు పాట్నా విశ్వ విద్యాలయంలోని సెనేట్, సిండికేట్ లో మొదటి సభ్యునిగా నియమింపబడ్డాడు. న్యాయవాదిగా జీవితాన్ని ప్రారంభించిన అనతికాలంలో స్వాతంత్ర్య పోరాటంవైపు ఆకర్షితు డై, 1906లో మొదటి సారి కలకత్తాలో నిర్వహించబడిన భారత జాతీయ కాంగ్రెస్ వార్షిక సమావేశాల ద్వారా సంబంధాన్ని పెంచుకున్నాడు. 2011లో రెండవసారి వార్షిక సమావేశాల సమయంలో జాతీయ కాంగ్రెస్ లో చేరాడు. 1916 లో లక్నోలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశాలలో మహాత్మా గాంధీని కలిసాడు. చంపారన్ లో జరగనున్న నిజ నిర్ధారన కమిటీలోనికి తనతో పాటు స్వచ్ఛంద కార్యకర్తగా రావాలని మహాత్మా గాంధీ అతనిని కోరాడు. 1918 లో'సర్చ్ లైట్'అనే ఆంగ్ల పత్రికను, ఆ తర్వాత 'దేశ్' అనే హిందీ పత్రికను నడిపాడు. 1920లో భారత జాతీయ కాంగ్రెస్ ద్వారా నిర్వహించబడిన సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొన్నాడు. అతడు తన లాభదాయకమైన న్యాయవాద వృత్తిని, అలాగే విశ్వవిద్యాలయంలోని అధ్యాపక వృత్తి విధులను తప్పుకున్నాడు. భారతీయ సాంప్రదాయ విధానాలలో విద్యాభ్యాసం అందిస్తున్న బీహార్ విద్యాపీఠాన్ని 1921లో తన మిత్రబృందంతో కలిసి స్థాపించి భారతీయ సంస్కృతి ఉట్టిపడేలా నడిపాడు. 1921లో మహాత్మా గాంధీతో ఒకమారు సమావేశం తరువాత, విశ్వవిద్యాలయంలో తన సెనేటర్ పదవికి రాజీనామా చేశాడు. రాజేంద్రప్రసాద్ 1934 అక్టోబరులో బొంబాయిలో జరిగిన అఖిల భారత కాంగ్రెసు మహాసభలకు అధ్యక్షునిగా ఎన్నికయ్యాడు. అలాగే 1939లో, నేతాజీ రాజీనామా చేసిన తరువాత, 1947లో ఇంకోసారి, మొత్తం మూడుసార్లు ఆ పదవిని చేపట్టాడు. 1942 ఆగస్టు 8 న క్విట్ ఇండియా సంధర్భంగా అరెస్టు చేసి, బాంకిపూర్ కేంద్ర కారాగానికి తరలించారు. దాదాపు మూడు సంవత్సరాల పాటు జైలు శిక్ష తర్వాత, 1945, జూన్ 15 న విడిచిపెట్టారు. 1946 సెప్టెంబరు 2 న ఏర్పడిన తాత్కాలిక ప్రభుత్వం జవాహర్ లాల్ నెహ్రూ నాయకత్వంలో 12 మంది మంత్రులను ఎంపిక చేయగా, రాజేంద్ర ప్రసాద్ ఆహారం, వ్యవసాయ శాఖకు మంత్రిగా పనిచేసాడు. 1946 డిసెంబరు 11 న రాజ్యాంగసభకు అధ్యక్షునిగా ఎన్నికయ్యాడు. కృపాలానీ కాంగ్రెస్ అధ్యక్షునిగా రాజీనామా చేసిన తరువాత 1947 నవంబరు 17 న కాంగ్రెస్ అధ్యక్షునిగా భాధ్యతలు స్వీకరించాడు. భారత స్వాతంత్ర్యం వచ్చిన రెండున్నర సంవత్సరాల తరువాత 1950 జనవరి 26 న స్వతంత్ర భారత రాజ్యాంగం ఆమోదించబడింది. రాజేంద్రప్రసాద్‌ను తొట్టతొలి రాష్ట్రపతిగా ఎన్నుకున్నారు. భారతదేశానికి అధ్యక్షునిగా రాజ్యాంగం ప్రకారం భాద్యతలు నిర్వర్తిస్తున్న వ్యక్తిగా ఏ రాజకీయ పార్టీకి చెందకుండా స్వతంత్రుడిగా వ్యవహరించాడు. ఒక రాష్ట్రపతిగా పక్షపాత ధోరణి లేకుండా, స్వతంత్రంగా వ్యవహరించేందుకు కాంగ్రెస్ పార్టీ రాజకీయాల నుండి వైదొలగి కొత్త సంప్రదాయాన్ని నెలకొల్పాడు. భారతదేశంలో విద్యాభివృద్ధిని ప్రోత్సహించేందుకు ప్రధానమంత్రి నెహ్రూకు వివిధ సందర్భాలలో సలహాల నిచ్చేవాడు. 1957లో రాష్ట్రపతిగా ఎన్నికై, రెండు సార్లు భారత రాష్ట్రపతిని చేపట్టిన ఏకైక వ్యక్తిగా చరిత్రలో నిలిచాడు.దేశానికి మొట్టమొదటి రాష్ట్రపతిగా స్వతంత్రంగా మెలిగి, ప్రధానిని గానీ పార్టీనిగానీ రాజ్యాంగ నిర్మాణంలో జోక్యం చేసుకోనీక, తరువాత రాష్ట్రపతులకు ఉదాహరణగా నిలిచాడు.

"హిందూ కోడ్ బిల్" చట్టం పై వివాదాల తరువాత అతను రాష్ట్ర వ్యవహారాల్లో మరింత చురుకైన పాత్రను పోషించాడు. 12 సంవత్సరాల పాటు భారత రాష్ట్రపతిగా సేవలందించి 1962న పదవీ విరమణ చేశాడు. 1963 ఫిబ్రవరి 28న ఆయన రాం రాం అంటూ కన్నుమూశాడు. దేశ్‌రత్న అని పిలువ బడిన ఆయనకు మరణానంతరం భారతరత్న పురస్కారాన్ని ప్రకటించారు.

## చరిత్రపొరల్లో దాగిన త్యాగధనుడు

భారత స్వాతంత్ర్య పోరాటం ఒకనాటిది, ఒక ఏటిది, ఒక దశాబ్దపుది, శతాబ్దపుది కాదు. అంతకన్నా ఎక్కువ సమయం కొనసాగిన నేపథ్యం ఉంది. అనేక సాయుధ పోరాటాలు, అహింసా యుత పద్ధతిలో జరిగిన ఉద్య మాలు భారత స్వాతంత్ర్యో ద్యమంలో భాగాలు. స్వాతంత్ర్య సమరయోధులు ఉద్యమాలు అనగానే 1857 విప్లవం మరిచిపోని మంగల్ పాండే, తాత్యా తోపే, బ్రిటిష్ సైన్యానికి వ్యతిరేకంగా పోరాడిన నిర్భయమైన రాణి లక్ష్మీబాయి, కిట్టూరుకు చెందిన రాణి చెన్నమ్మ, రాణి గైడిన్లు, చంద్రశేఖర్ ఆజాద్, రామ్ ప్రసాద్ బిస్మిల్, భగత్ సింగ్, సుఖ్దేవ్, రాజ్‌గురు, గురు రామ్ సింగ్, పాల్ రామసామి, రాజేంద్ర ప్రసాద్, పండిట్ నెహ్రూ, సర్దార్ పటేల్, బాబా సాహెబ్ అంబేద్కర్, సుభాష్ చంద్రబోస్, మౌలానా ఆజాద్, ఖాన్ అబ్దుల్ గఫర్ ఖాన్, వీర్ సావర్కర్ వంటి లెక్కలేనన్ని మంది నాయకులు, గొప్ప వ్యక్తిత్వా లన్నీ స్వాతంత్ర్య ఉద్యమానికి మార్గ దర్శకులు. అలా దేశమాత దాస్య విముక్తి గావించడం కోసం ఎందరో వీరాధివీరులు, మహ నీయులు తమ ప్రాణాలొడ్డి జీవితాలను అర్పించారు. అందులో చక్రవర్తులు, సాయుధ వీరులు, యువకులు... ఎందరో దేశ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలనే త్యాగం చేశారు. భారత దేశ స్వాతంత్ర్య పోరాటంలో రక్తం మరిగే అంశాలు, రోమాలు నిక్కపొడుచుకునే సంఘటనలు ఎన్నో ఉన్నాయి. స్వేచ్ఛా భారతా వని కోసం అశువులు బాసిన ఎంతో మంది త్యాగధనుల చరిత్ర ఇప్పటి తరాల యువతకు ఎంతో ఉద్వేగ భరితంగా, మరెంతో ఉద్విగ్నంగా పరిణ మిస్తుంటుంది. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ పోరాట పటిమను, తెగువను, త్యాగాన్ని చూపించారు. ఎందరో తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారు. ఈ అసంఖ్యాక స్వాతంత్ర్యోద్యమాల కాలంలో ఎందరో అమరవీరులు ఉన్నారు. ఇందులో చరిత్ర చాలామందిని గ్రంథస్థం చేయలేక పోయింది. చేసినా కొందరిని చరిత్ర మరుగున పడేసింది. అలా చరిత్ర పొరల మాటున ఉన్న వారిలో యువ కిషోరం ఖుదీరాం ముఖ్యుడు. 18ఏళ్ల నూనూగు మీసాల యువ ఖుదీరాం బోస్ దేశం గర్వించదగ్గ త్యాగాన్ని మరిచినా, యాదృచ్ఛి కంగా విస్మరించినా, దేశ స్వాతంత్ర్య చరిత్ర పరిపూర్ణం కానట్టే. ఖుదీరాం బోస్ భారతీయ స్వాతంత్ర్య సమర వీరులలో మొదటి తరానికి చెందిన అతిపిన్న వయస్కుడు. భారత దేశ వాసులను వేధించిన బ్రిటిష్ అధికారిపై బాంబు వేసిన మొదటి సాహస వీరుడు ఖుదీరాం. ఆ కారణంగా అతనిని ఉరితీసే నాటికి అతని వయసు కేవలం 18 సంవత్సరాల 7 నెలల 11 రోజులు మాత్రమే. ఖుదీరాం పశ్చిమ బెంగాల్, మిడ్నాపూర్ జిల్లా హబీబ్‌పూర్‌లో 1889 డిసెంబర్ 3న జన్మించాడు. చిన్ననాటి నుంచి స్వాతంత్ర్య కాంక్షతో రగిలిపోయేవాడు. మొదట్లో అఖ్రా అనే విప్లవ సంస్థలో చేరాడు. తన నాయకత్వ లక్షణాలు, సాహసో పేతమైన స్ఫూర్తితో ఆ సంస్థలో అందరి దృష్టినీ ఆకర్షించాడు. ఆయన టీచర్ సత్యేంద్రనాథ్ బోస్, భగవద్గీతలను స్ఫూర్తిగా తీసుకు న్నాడు. 1905లో బెంగాల్ విభజన అతడిలో బ్రిటిష్ ప్రభుత్వంపై మరింత కసి రేపింది. 16 ఏళ్ల వయసులోనే ప్రభుత్వ కార్యాల యాలు, పోలీస్ స్టేషన్‌లను బాంబులతో పేల్చివేశాడు. 1907 ఆగస్టు 26న ఒక కేసు విచారణ సందర్భంగా ఎంతోమంది యువకులు కోర్టు ముందర ఆసక్తిగా గుమికూడి ఉన్నారు. పరిస్థితి శాంతి యుతంగా ఉన్నప్పటికీ ఉన్నట్లుండి పోలీసులు లాఠీలను ప్రయోగించారు. ఈ వ్యవహారాన్ని అక్కడే ఉండి చూస్తున్న సుశీల్ కుమార్ సేన్ అనే 15 ఏళ్ళ యువకుడు భరించలేక ఆవేశంతో ఒక ఇంగ్లీష్ అధికారి ముక్కుమీద ఒక్కగుద్దు గుద్దాడు.

## పిల్లల ప్రాణాలకంటే.. మార్కులే ముఖ్యమా?

'నేనేమి చెప్పాలి మా స్కూల్ టీచర్లు ఇలానే ఉంటారు..' ఇది ఢిల్లీలోని ప్రముఖ సెయింట్ కొలంబా కాన్వెంట్ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న 16 సంవత్సరాల విద్యార్థి ఆత్మహత్యకు ముందుగా తన తల్లిదండ్రులకు రాసిన సూసైడ్ నోట్‌లోని వాక్యం. ఈ చిన్న వాక్యం వెనుక ఎంత బాధ, ఎంత అవమానం, ఎంత నిస్సహాయత దాగి ఉందో ఊహించుకోవడం కూడా కష్టమే... ఈ ఘటనకు దారితీసిన కారణాలు ఏమిటి? బాధ్యత ఎవరిది? దేశంలో విద్యార్థుల ఆత్మహత్యలు రోజురోజుకు పెరుగుతున్నాయి. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో ప్రకారం, దేశంలోని మొత్తం ఆత్మహత్యల్లో 8% విద్యార్థులవే, ఇది చాలా ఆందోళన కలిగించే విషయం. అయితే ఇటీవల ఢిల్లీలో జరిగిన ఈ ఘటన దేశ రాజధానికే కాదు, దేశవ్యాప్తంగా విద్యావేత్తలను కూడా కుదిపేసింది. ఢిల్లీ ప్రభుత్వం మాత్రమే కాదు, నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ కూడా ఈ అంశంపై విచారణ ప్రారంభించింది. ఈ బాలుడు రెండవ తరగతి నుంచే ఈ స్కూల్‌లో చదువుతున్నాడు. సినిమా రంగంపై ఆసక్తి, డాన్స్, యా క్షన్, స్క్రిప్ట్ రాయడం వంటి క్రియాశీలత అతనిలో బాగా నే ఉండేది. నటుడిగా మారాలని, డిగ్రీ తరువాత ముంబై కి వెళ్లాలని కూడా తన స్నేహితులకు చెప్పేవాడట. ఇలాం టి క్రియేటివ్ టాలెంట్ ఉన్న విద్యార్థిని సరైన దిశలో ప్రోత్సహించాల్సింది పోయి, స్కూల్‌లో కొందరు టీచర్ల ప్రవర్తనే అతని జీవితాన్ని ఇంత దారుణానికి నెట్టింది. ఈ ఘటనకు నాలుగు రోజుల ముందు, డాన్స్ క్లాసులో కాలు నొప్పితో పడిపోయిన బాలుడిని డాన్స్ టీచర్ లేవనెత్తడం బదులు, 'ఓవర్ యాక్షన్ చేస్తున్నావు', 'ఇది అంతా డ్రామా' అంటూ తోటి విద్యార్థుల ముందు అవమా నించిందట. అంతేకాక, మిగతా ముగ్గురు అకడమిక్ టీచర్లు కూడా తరుచూ అతని మార్కుల గురించి అవహేళన చేస్తూ, 'పేరెంట్స్‌ను పిలుస్తాం', 'టీసీ ఇస్తాం' అంటూ బెదిరించేవారని అతని స్నేహితులు పోలీసులకు చెబుతున్నారు.స్కూల్‌లో నలుగురు కౌన్సెలర్లు ఉన్నప్పటికీ, వారికి ఈ విద్యార్థిలో మారుతున్న భావోద్వేగ పరిస్థితి గుర్తించలేక పోయారు. అలాంటప్పుడు స్కూల్‌లో కౌన్సెలర్ల ఉనికి కేవలం ఒక 'పోస్టు'గా ఉంటే ప్రయోజనం ఏముంది? అంతేకాదు తల్లిదండ్రులకు ఇందులో బాధ్యత ఉంది. చనిపోయే నాలుగు రోజుల ముందు బాలుడు తన తండ్రిని వేడుకుంటూ.. 'నన్ను వేరే స్కూల్‌కు మార్చండి' అని చెప్పినా, తండ్రి 'పరీక్షలు దగ్గరపడ్డాయి, వచ్చే ఏట మార్చుతాను' అని చెప్పాడు. పిల్లవాడు స్కూల్‌కు వెళ్లలేనంత బాధలో ఉన్నానని చెబితే, అది సాధారణ అసహనం కాదు. అది సహాయం కోసం ఇచ్చే స్పష్టమైన సంకేతం. ఈ సమయంలో తల్లిదండ్రుల తక్షణ స్పందన అవసరం ఆ పిల్లాడు తండ్రికి చెప్పినప్పుడు పరిస్థితిని అర్థం చేసుకొని స్కూల్ టీచర్లతో మాట్లాడటం, కౌన్సెలింగ్‌కు తీసుకెళ్లటం వంటివి చేసి ఉంటే ఈ రోజు ఆ విద్యార్థి బతికేవాడు. కానీ అలా జరగలేదు. విద్యా వ్యవస్థలోని లోపాలు ఈ సమస్యలకు మూలకారణం. మన విద్యా వ్యవస్థలో ఇప్పటికీ మెకాలే మోడల్‌నే పాటించే ధోరణి కొనసాగుతోంది. క్రియేటివిటీ, ప్రతిభ, నైపుణ్యాలు ఇవన్నీ పక్కన బెట్టి కేవలం మార్కులు మీదే దృష్టి పెట్టే వ్యవస్థ వల్ల విద్యార్థి మానసికంగా కుంగిపోవడానికి కారణమవుతున్నాయి. ఒక్కసారి ఆలోచించండి చదువు రాదన్న కారణంతోనే మనసులోని ప్రతిభ విలువ తగ్గిపోతుందా? తెలుగు సినీ రంగంలో హాస్య బ్రహ్మ రేలంగికి చదువు రాదని చెబుతారు. కానీ వారి ప్రతిభను ఎవరో గుర్తించి ప్రోత్సహించినందుకే ఆయన ఒక చిరస్థాయి నటుడయ్యారు. అయితే, ఇక్కడి బాలుడు ఇలాంటి అవకాశాన్ని కూడా పొందలేకపోయాడు. ఈ అవమానాలు, బెదిరింపులు, పబ్లిక్ హ్యూమిలియేషన్ ఇవి ఒక్కో చిన్న ఘటనలా కనిపించినా, ఒక సున్నితమైన మనసున్న టీనేజర్‌కు ఇవి పెద్ద గాయాలే.

ఈ ఘటనను పరిశీలిస్తే, ఈ ఆత్మహత్యకు బాధ్యత ఒక్కరిపై కాదు. ఇది ఒక క్రమపద్ధతిలో జరిగిన వైఫల్యాల సమాహారం. కొందరి టీచర్ల ప్రత్యక్ష ప్రేరేపణ, అవహేళన, పబ్లిక్ హ్యూమిలియేషన్, అనవసర బెదిరింపులు, కుంగుబాటును, ఆవేదనను అర్థం చేసుకోలేని నిర్లక్ష్యం, కేవలం మార్కుల ఆధారిత విలువల కారణంగా, క్రియేటివిటీకి స్థానం లేకపోవడం వంటివి ప్రత్యక్ష కారణాలు.. ఇక అతన్ని రక్షించాల్సిన వారందరూ తమ పాత్రను సరిగా నిర్వర్తించకపోవడంతో ఈ ఘటన జరిగింది. ఇది కేవలం ఒక విద్యార్థి మరణం, ఒక కుటుంబానికి నష్టం కాదు. అది మొత్తం విద్యా వ్యవస్థకు పెను హెచ్చరిక.ఈ చావుకు నిజమైన బాధ్యత మన వ్యవస్థదే.

# పార్లమెంట్‌లో 14 బిల్లులు ప్రవేశపెట్టనున్న కేంద్రం



**న్యూఢిల్లీ:** పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో 14 బిల్లులు ప్రవేశపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. ప్రతిపాదిత అణుశక్తి బిల్లు 2025 ఇందులో కీలకమైనది. అణుశక్తి రంగంలో ప్రైవేట్ రంగ భాగస్వామ్యాన్ని అనుమతించడం ఈ బిల్లు ముఖ్య ఉద్దేశం. భారత ఉన్నత విద్యా కమిషన్ బిల్లు 2025 కూడా ప్రాధాన్యత సంతరించుకున్నది. యూనివర్సిటీలు, ఉన్నత విద్యా సంస్థలకు స్వయంప్రతిపత్తిని ప్రోత్సహించడానికి, పారదర్శక అక్రిడిటేషన్ విధానాలు, విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు బలమైన నియంత్రణ పర్యవేక్షణ కోసం కేంద్ర కమిషన్ ఏర్పాటు చేయడం లక్ష్యంగా ఈ బిల్లును కేంద్రం ప్రవేశపెట్టనున్నది.

కాగా, ఇతర బిల్లుల జాబితాలో జన్ విశ్వాస్ (నిబంధనల సవరణ) బిల్లు 2025, దివాలా మరియు దివాలా కోడ్ (సవరణ) బిల్లు 2025, ఆర్డినెన్స్ స్థానంలో మణిపూర్ వస్తువులు, సేవల పన్ను (రెండవ సవరణ) బిల్లు 2025, జాతీయ రహదారుల (సవరణ) బిల్లు 2025 ఉన్నాయి.

మరోవైపు కంపెనీల చట్టం 2013, ఎల్‌ఎల్‌పీ చట్టం 2008లోని నిబంధనలను సవరించడానికి ఉద్దేశించిన కార్పొరేట్ చట్టాల (సవరణ) బిల్లు 2025, సెబీ చట్టం 1992, డిపాజిటరీల చట్టం 1996, సెక్యూరిటీ కాంట్రాక్టుల (నియంత్రణ) చట్టం 1956లను ఏకీకృత మార్కెట్ కోడ్‌గా ఏకీకృతం చేయడానికి ఉద్దేశించిన సెక్యూరిటీస్ మార్కెట్స్ కోడ్ బిల్లు 2025, బీమా చట్టాలు (సవరణ) బిల్లు 2025 కూడా ఈ జాబితాలో ఉన్నాయి.

కాగా, ఇటీవలి సుప్రీంకోర్టు పరిశీలనల తర్వాత సెక్షన్ 34తో సహా ఆర్బిట్రేషన్, రాజీ చట్టానికి సవరణలను ప్రతిపాదించే ఆర్బిట్రేషన్ మరియు రాజీ (సవరణ) బిల్లు 2025, సెంట్రల్ ఎక్సైజ్ (సవరణ) బిల్లు 2025, హెల్త్ సెక్యూరిటీ, నేషనల్ సెక్యూరిటీ సెస్ బిల్లు 2025 కూడా కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నది. అయితే వివాదం నేపథ్యంలో చండీగఢ్ కేంద్రపాలిత ప్రాంతానికి నేరుగా రాష్ట్రపతికి అధికారం ఇచ్చే బిల్లు ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకున్నది.

# భానుడి తాకిడికి ఎ320 విమానాల విలవిల!

చిన్నపాటి పక్షుల ఢీ ఘటనల పట్లే కాకుండా చిన్నపాటి సాఫ్ట్‌వేర్ వైరుధ్యాల విషయంలోనూ విమాన సంస్థలు అప్రమత్తంగా ఉండాలని జెట్‌బ్లూ సంస్థకు చెందిన ఎయిర్‌బస్ ఎ320 ఎయిర్‌క్రాఫ్ట్ ఉదంతం స్పష్టంచేస్తోంది. అక్టోబరు 30న ఈ లోహవిహంగం పైలట్ ప్రమేయం లేకుండానే అనూహ్యంగా ఆకాశం నుంచి కిందకి జారిపోవడం మొదలైంది. ఎయిర్‌క్రాఫ్ట్‌లోని సాఫ్ట్‌వేర్‌పై తీవ్రస్థాయి సౌరరేడియోధార్మికత ప్రభావం చూపడమే దీనికి కారణమని తేలడం నిపుణులను విస్మయానికి గురిచేసింది. విమాన డిజైన్ సమయంలో మరింత పకడ్బందీగా వ్యవహరించాల్సిన ఆవశ్యకతను ఇది సూచిస్తోంది.




### ఎందుకీ సమస్య?

ఎ320 విమానాన్ని తొలిసారిగా 1984లో ప్రవేశపెట్టారు. ఫ్లై–బై–వైర్ అనే కంప్యూటరైజ్డ్ ఫ్లైట్ కంట్రోల్ వ్యవస్థ కలిగిన తొలి వాణిజ్య ఎయిర్‌క్రాఫ్ట్‌గా ఇది గుర్తింపు పొందింది.

నింగిలో ఈ విమాన గమనాన్ని మార్చాలనుకున్నప్పుడు పైలట్.. కాక్‌పిట్‌లోని నియంత్రణ వ్యవస్థలను నిర్దేశిత రీతిలో కదిలిస్తారు. దీనికి అనుగుణంగా కంట్రోల్ వ్యవస్థలు ఎలక్ట్రానిక్ సంకేతాలను పంపుతాయి.

ఈ సంకేతాలను ఎలివేటర్ అండ్ ఎయిలిరాన్ కంప్యూటర్ (ఈల్యాక్) ప్రాసెస్ చేస్తుంది. పైలట్ నిర్దేశానికి అనుగుణంగా ఎలివేటర్లు, ఎయిలిరాన్లను సర్దుబాటు చేస్తుంది. ఎలివేటర్‌లో కదలికల ద్వారా విమానాన్ని పైకి లేదా కిందకి వెళ్లేలా చేయవచ్చు. ఎయిలిరాన్లలో మార్పుల ద్వారా ఎయిర్‌క్రాఫ్ట్‌ను ఎడమ లేదా కుడి వైపునకు మళ్లించొచ్చు.

మొత్తంమీద ఈల్యాక్ వ్యవస్థ అనేది ఎలివేటర్, ఎయిలిరాన్లను నియంత్రించే మెదడు లాంటిది. ఇది గందరగోళానికి లోనైతే పైలట్ ప్రమేయం లేకుండానే ఈ రెండు వ్యవస్థల్లో మార్పులు జరిగి, విమాన గమనంలో ఆకస్మిక మార్పులు రావొచ్చు. ఫలితంగా ఎయిర్‌క్రాఫ్ట్ ఆకృతి పటిష్ఠతపై కూడా ప్రభావం పడొచ్చు. బోయింగ్ సంస్థకు చెందిన 737 మ్యాక్స్ విమానాల్లోనూ ఫ్లైట్ కంట్రోల్ సాఫ్ట్‌వేర్‌లో లోపాలు తలెత్తి, ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. దీంతో ఆ శ్రేణి విమానాలను సుదీర్ఘ సమయం పాటు నిలిపివేశారు.

### సాఫ్ట్‌వేర్‌లో లోపంతో..

ఎయిర్‌బస్‌కు చెందిన ఎ320 తరగతి విమానాల్లో ఎల్104 అనే సాఫ్ట్‌వేర్ వెర్షన్‌ను ప్రవేశపెట్టారు. ఈ సాఫ్ట్‌వేర్ తీవ్రస్థాయి సౌర జ్వాలల ప్రభావానికి లోనయ్యే అవకాశం ఉందని నిపుణులు తాజాగా పేర్కొన్నారు. దీనివల్ల.. అసాధారణ సందర్భాల్లో పైలట్ ప్రమేయం లేకుండానే ఎలివేటర్, ఎయిలిరాన్లలో ఆకస్మిక మార్పులు జరగొచ్చని తేల్చారు. జెట్‌బ్లూ విమానంలో ఎలివేటర్ ఇదేరీతిలో ఆకస్మికంగా మారడంతో విమానం వేగంగా కిందకి దిగిందని పేర్కొన్నారు. ఈ పరిణామం కొద్దిసేపే సాగింది. అయితే ఈ క్రమంలో విమాన డిజైన్ పరిమితులను అది దాటిపోయింది.

ఈలోగా ఎయిర్‌క్రాఫ్ట్‌లోని ఆటోపైలట్.. దాని ప్రయాణ మార్గాన్ని సరిచేసింది.

### ఏమిటీ సౌరజ్వాలలు?

సూర్యుడి నుంచి వచ్చే ఆవేశిత రేణువులు, విద్యుదయస్కాంత తరంగాలను సౌర రేడియోధార్మికతగా పేర్కొంటారు. ఇందులో దృశ్యకాంతి, అతినీలలోహిత కిరణాలు, ప్రొటాన్లు, ఎలక్ట్రాన్లు వంటి ఆవేశిత రేణువులు ఉంటాయి. కొన్నిసార్లు సూర్యుడి నుంచి విస్ఫోటంలా తీవ్రస్థాయి జ్వాలలు, సౌర తుపాన్లు వెలువడతాయి. ఆ సమయంలో సౌర రేణువులు.. కాంతి వేగంతో భూమిని తాకుతాయి. అయితే భూమికి సంబంధించిన అయస్కాంత క్షేత్రం, దట్టమైన వాతావరణం వల్ల పుడమి మీదున్న జీవానికి, సాంకేతిక పరిజ్ఞానానికి సహజసిద్ధ రక్షణ లభిస్తోంది. విమానాలు ప్రయాణించే ఎత్తయిన ప్రదేశాల్లో ఈ రక్షణ ఒకింత తగ్గుతుంది. సౌర తుపాను బలంగా ఉన్నప్పుడు నేల నుంచి 8.5 కిలోమీటర్ల ఎత్తులో ఆవేశిత రేణువుల తాకిడి పెరిగి, లోహవిహంగాల ఎలక్ట్రానిక్స్‌పై ప్రభావం పడొచ్చు. ఇలాంటి పరిస్థితుల్లో వేగంగా దూసుకొచ్చే సౌర రేణువులు విమాన ఎలక్ట్రానిక్ వ్యవస్థల్లోకి చొచ్చుకెళ్లే ప్రమాదం ఉంది. ఫలితంగా వాటి మెమరీ వ్యవస్థలోని బిట్‌లలో వైరుధ్యాలు తలెత్తుతాయి. దీన్ని 'బిట్ ఫ్లిప్' అంటారు. దీనివల్ల డేటా కరప్ట్ కావొచ్చు. ఫలితంగా ఎయిర్‌క్రాఫ్ట్‌లోని నేవిగేషన్, కమ్యూనికేషన్, ఫ్లైట్ కంట్రోల్ వ్యవస్థల్లో అవరోధాలు కలగొచ్చు. ఈ నేపథ్యంలో విమానాల డిజైన్‌లో సౌర రేడియోధార్మికతను చాలా ముఖ్యమైన అంశంగా పరిగణిస్తారు.

### మేల్కొలుపు

విమానాల్లో కీలక వ్యవస్థలకు రిడండెన్సీ ఏర్పాటు ఉంటుంది. ఫలితంగా.. ఒకటి విఫలమైతే మరొకటి అందుబాటులో ఉంటుంది. అయితే చిన్నపాటి సాఫ్ట్‌వేర్ మార్పులు కూడా విమానాన్ని దుర్బలంగా మార్చే వీలుందని జెట్‌బ్లూ ఘటన చెబుతోంది. సౌర జ్వాలలు, తుపాన్ల సమయంలో ఇది మరింత ప్రమాదకరంగా ఉంటుందని తేల్చింది. ప్రస్తుతం సౌర కాలచక్రంలో గరిష్ఠ స్థాయి నడుస్తోంది. ఈ సమయంలో సౌర తుపాన్ల తీవ్రత ఎక్కువగా ఉంటుంది. దీనివల్ల ఏవియానిక్స్ వ్యవస్థల్లో అవరోధాలు, ఉపగ్రహ సేవల్లో ఆటంకాలు, జీపీఎస్ వ్యవస్థ కచ్చితత్వంలో తేడాలు, కొన్ని ప్రయాణ మార్గాల్లో కమ్యూనికేషన్ వ్యవస్థల్లో అవరోధాలు ఉత్పన్నం కావొచ్చు. ఈ నేపథ్యంలో ఎయిర్‌క్రాఫ్ట్ సాఫ్ట్‌వేర్‌లో రేడియోధార్మికతను తట్టుకునే వెసులుబాటు ఉండాలి. యాంత్రిక సంబంధ ముప్పులతోపాటు అంతరిక్ష ముప్పులనూ తట్టుకునేలా రిడండెన్సీని ఏర్పాటు చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.

# పరిశోధన రంగంలో భారత్ సత్తా చాటుతోంది

పరిశోధన రంగంలో భారత్ దూసుకుపోతున్నదని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ప్రపంచంలో ఏదైనా సాధించే సత్తా భారత్‌కు ఉందని చెప్పారు. మన్ కీ బాత్ 128వ ఎపిసోడ్‌లో ప్రసంగించిన ప్రధాని.. మన యువత అసమాన శక్తి, బలమైన సంకల్పంతో దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తోందని పేర్కొన్నారు.

గత 11 ఏళ్లలో విజ్ఞానం, క్రీడలు, సామాజిక సేవ, సంస్కృతి వంటి వివిధ రంగాల్లో యువత అద్భుతమైన ప్రతిభ కనబరిచారని ప్రధాని ప్రశంసించారు. కష్టతరమైన వాటిని కూడా భారత్ సాధిస్తోందని చెప్పారు. అంధుల మహిళా క్రికెట్ జట్టు ప్రపంచకప్ గెలిచి చరిత్ర సృష్టించిందని ప్రశంసించారు. స్టార్టప్ ఇండియా, స్కిల్ ఇండియా, డిజిటల్ ఇండియా వంటి సంస్కరణలతో భారత యువత వికసిత్ భారత్ కలను సాకారం చేస్తారని తాను బలంగా విశ్వసిస్తున్నట్లు ప్రధాని చెప్పారు.

కొన్ని రోజుల క్రితం సోషల్ మీడియాలోని ఓ వీడియో తన దృష్టిని ఆకర్షించిందని ప్రధాని చెప్పారు. అంగారక గ్రహంపై ఉన్న వాతావరణ పరిస్థితులను కృత్రిమంగా రూపొందించిన చోట డ్రోన్లను ఎగరవేయడానికి మన యువత ప్రయత్నించారని అన్నారు. జీపీఎస్ మద్దతు లేక డ్రోన్‌లు నేలకూలుతున్నప్పటికీ.. పుణెకు చెందిన విద్యార్థుల బృందం పట్టుదలతో పలుమార్లు యత్నించి డ్రోన్లు కొంత సమయం ఎగిరేలా చేసినట్లు వెల్లడించారు. యువతలో ఉన్న ఇలాంటి గొప్ప సంకల్ప బలమే దేశాన్ని వికసిత్ భారత్‌గా మార్చేందుకు తోడ్పడుతుందన్నారు.



## నక్సల్ ఉద్యమానికి మరో దెబ్బ



దంతెవాడ:ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంతంలో మావోయిస్టులకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. దంతెవాడ జిల్లాలో ప్రభుత్వం అమలు చేస్తున్న 'లోన్ వర్రాటు', 'పూనా మర్గం' (పునరావాసం ద్వారా పునరుజ్జీవనం) పథకాలకు ఆకర్షితులై 37 మంది మావోయిస్టులు ఆదివారం లొంగిపోయారు. వీరిలో 27 మందిపై మొత్తం రూ. 65 లక్షల రివార్డు ఉందని అధికారులు వెల్లడించారు. హింసామార్గాన్ని వీడి జనజీవన స్రవంతిలో కలిసేందుకు సిద్ధంగా ఉన్నామని, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వ పునరావాస విధానంపై తమకు పూర్తి నమ్మకం ఉందని లొంగిపోయిన మావోయిస్టులు పేర్కొన్నారు. దంతెవాడలోని డీఆర్‌జీ కార్యాలయంలో పోలీసు, సీఆర్‌పీఎఫ్ ఉన్నతాధికారుల సమక్షంలో వీరు లొంగిపోయారు. వీరిలో 12 మంది మహిళలు కూడా ఉన్నారు. వారి నుంచి పెద్ద ఎత్తున ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా దంతెవాడ ఎస్పీ గౌరవ్ రాయ్ మాట్లాడుతూ.. "మా నిరంతర ప్రయత్నాలు, స్థానిక ప్రజల మద్దతు ఫలించాయి. అడవుల్లో జీవించడం కష్టంగా మారిందని, పోలీసులు అన్ని ప్రాంతాలకు చేరుకుంటున్నారని, గ్రామస్తుల నుంచి కూడా మద్దతు లభించడం లేదని లొంగిపోయిన వారు చెబుతున్నారు" అని వివరించారు. లొంగిపోయిన వారిలో కొందరు సీనియర్ మావోయిస్టు కమాండర్లకు బాడీగార్డులుగా పనిచేసిన వారు కూడా ఉన్నారని తెలిపారు. ప్రభుత్వ పునరావాస విధానం ప్రకారం లొంగిపోయిన వారికి రూ. 50,000 ఆర్థిక సాయంతో పాటు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ, వ్యవసాయ భూమి వంటి అదనపు ప్రయోజనాలు అందిస్తారు. గత 20 నెలల్లో దంతెవాడ జిల్లాలో 165 మంది రివార్డు ఉన్న మావోయిస్టులతో సహా మొత్తం 508 మంది లొంగిపోయారని అధికారులు తెలిపారు. ఈ పరిణామం హింసారహిత బస్తర్ దిశగా వేసిన మరో కీలక అడుగు అని వారు అభివర్ణించారు.

## అఖిలపక్ష సమావేశం నిర్వహించిన కేంద్రం..

## పలు అంశాలపై గళమెత్తనున్న ప్రతిపక్షం



**న్యూఢిల్లీ:** సోమవారం నుంచి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఆదివారం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసింది. పార్లమెంట్ సమావేశాల గడువు, ప్రవేశపెట్టనున్న బిల్లులతో పాటు ప్రతిపక్షాలు లేవనెత్తనున్న అంశాలపై చర్చ జరిగినట్లు సమాచారం. పార్లమెంట్ హౌస్‌లో జరిగిన అఖిలపక్ష సమావేశానికి కేంద్ర ప్రభుత్వం తరపు సీనియర్ మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, కిరణ్ రిజిజు, జేపీ నడ్డా, పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ పాల్గొన్నారు. ప్రతిపక్షం తరుపున కాంగ్రెస్ నేతలు జైరామ్ రమేష్, గౌరవ్ గొగోయ్, ప్రమోద్ తివారీ, ఆర్జేడీకి చెందిన మనోజ్ ఝా, డీఎంకే ఎంపీ టీఆర్ బాలు, తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన డెరెక్ ఓ'బ్రియన్, కళ్యాణ్ బెనర్జీ, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ ఎంపీ ఈటీ మొహమ్మద్ బషీర్ తదితర నేతలు పాల్గొన్నారు. కాగా, పార్లమెంటు శీతాకాల సమావేశాలు డిసెంబర్ 1న ప్రారంభమై డిసెంబర్ 19న ముగుస్తాయి. ఈ ఏడాది 15 సమావేశాలకు షెడ్యూల్ చేశారు. సాధారణంగా జరిగే 20 సమావేశాల కంటే ఈ సంఖ్య గణనీయంగా తగ్గింది. మరోవైపు ఎన్నికల జాబితాల ప్రత్యేక ఇంటెన్సివ్ సవరణ (సర్), ఢిల్లీ కారు బాంబు పేలుడు, ప్రభుత్వ విదేశాంగ విధానాలు, ఇతర అంశాలపై గళమెత్తేందుకు ప్రతిపక్షాలు సిద్ధమవుతున్నాయి. అయితే సమావేశాల వ్యవధి తక్కువగా ఉండటంతో సభా కార్యకలాపాలు సజావుగా సాగేందుకు సహకరించాలని ప్రభుత్వం కోరింది.

## తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం...

## 11 మంది దుర్మరణం

**శివగంగ జిల్లా తిరుపత్తూర్ సమీపంలో ఘటన**

**కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో పెరగనున్న మృతుల సంఖ్య**

**వారం రోజుల వ్యవధిలోనే ఇది రెండో పెద్ద బస్సు ప్రమాదం**



తమిళనాడులో ఆదివారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. శివగంగ జిల్లాలోని తిరుపత్తూర్ సమీపంలో రెండు ఆర్టీసీ బస్సులు ఢీకొన్నాయి. ఈ దుర్ఘటనలో ఒక చిన్నారితో సహా 11 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. వివరాల్లోకి వెళితే, ఒక బస్సు తిరుప్పూర్ నుంచి కారైకుడి వస్తుండగా... మరో బస్సు కారైకుడి నుంచి దిండిగల్‌కు ప్రయాణిస్తోంది. తిరుపత్తూర్ వద్దకు రాగానే ఈ రెండు బస్సులు ఢీకొన్నాయి. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు సహాయక చర్యలు చేపట్టి, క్షతగాత్రులను శివగంగ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమిళనాడులో వారం రోజుల వ్యవధిలోనే ఇలాంటి ఘోర ప్రమాదం జరగడం ఇది రెండోసారి కావడం గమనార్హం. నవంబర్ 24న తెన్కాశి జిల్లాలో రెండు ప్రైవేట్ బస్సులు ఢీకొన్న ఘటనలో ఐదుగురు మహిళలు సహా ఆరుగురు మరణించగా, 56 మంది గాయపడ్డారు. ఆ ప్రమాదానికి డ్రైవర్ అతివేగమే కారణమని పోలీసులు నిర్ధారించారు. ఆ ఘటనలో మృతుల కుటుంబాలకు సీఎం ఎంకే స్టాలిన్ రూ. 3 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు.



# బిజినెస్



## ప్రమాదంలో వోడాఫోన్..




ఇతర నెట్‌వర్క్ లతో పోలిస్తే, జియోలో అన్ని సౌకర్యాలు, ఆఫర్లు ఉంటున్నాయని జనాల నమ్మకం. ముఖ్యంగా నెట్‌వర్క్ విషయంలో జియోను ఎక్కువగా జనాలు ఎంచుకుంటున్నారు. ఏ మూలకు వెళ్లినా సిగ్నల్ తప్పకుండా వస్తుంది. అందుకే సామాన్యుల నుంచి కోటీశ్వరుల వరకు అందరూ జియో జపం చేస్తున్నారు. ఇక ఆ జియో నెట్‌వర్క్ ను తట్టుకునేందుకు ఎయిర్ టెల్, వోడాఫోన్ ఐడియా, అటు బీఎస్ఎన్ఎల్ చాలా కష్టపడాల్సి వస్తోంది. అయినప్పటికీ ఈ ఇతర నెట్‌వర్క్ నుంచి కస్టమర్లను తమ వైపునకు ప్రతినెల లాగేసుకుంటుంది జియో. ఇక తాజాగా అక్టోబర్ మాసం 2025 సంవత్సరంలో కూడా జియో ప్రభంజనం సృష్టించింది. ఈ ఒక్క నెలలో 1.99 మిలియన్స్ మొబైల్ యూజర్లను సంపాదించింది జియో. అంటే దాదాపుగా 19.97 లక్షల మంది కొత్తగా అక్టోబర్ మాసంలో జియోలోకి వచ్చేశారన్న మాట. ఆ తర్వాత ఎయిర్ టెల్ 1.25 మిలియన్స్ తో దూసుకు వెళ్తోంది. అక్టోబర్ మాసంలో ఎయిర్ టెల్ కు 12.52 లక్షల కొత్త యూజర్లు తరలివచ్చారు. అటు %దీ*చీ*% కూడా మంచి పర్ఫామెన్స్ చూపిస్తోంది. అక్టోబర్ మాసంలో 2.69 లక్షల కొత్త యూజర్లను సంపాదించగలిగింది బీఎస్ఎన్ఎల్. అయితే ఈ మూడింటి కంటే చిట్ట చివరన వోడాఫోన్ ఐడియా ఉంది. అక్టోబర్ మాసంలో కొత్త యూజర్లను తెచ్చుకోవడం కాదు, ఉన్న యూజర్స్ ను కోల్పోయింది వోడాఫోన్ ఐడియా. ఈ అక్టోబర్ మాసంలో 20.83 లక్షల మందిని కోల్పోయిందని చెబుతున్నారు. వీళ్లంతా ఎక్కువ శాతం జియోకు వెళ్లినట్లు నివేదికలు చెబుతున్నాయి. ఆ తర్వాత ఎయిర్ టెల్, కొంత మందిని ఆకర్షించగలిగిందని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఇక ఇలా తమ యూజర్లను కోల్పోతే, వోడాఫోన్ ఐడియా కంపెనీ మరింత కష్టాల్లో పడే ప్రమాదం పొంచి ఉన్నట్లు చెబుతున్నారు.

## రూ.7 లక్షల కోట్ల కార్పొరేట్ రుణాలకు సిద్ధం



దేశీయంగా ఆర్థిక కార్యకలాపాలు పుంజుకోవడంతో, కార్పొరేట్ సంస్థల నుంచి రుణాలకు గిరాకీ మళ్లీ పెరుగుతోందని.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మిగిలిన రెండు త్రైమాసికాల్లో కార్పొరేట్ రుణాల మంజూరులో రెండంకెల వృద్ధి సాధించొచ్చని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఛైర్మన్ సి.శ్రీనివాసులు శెట్టి పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో రూ.7 లక్షల కోట్ల విలువైన కార్పొరేట్ రుణాలను పంపిణీ చేయనున్నామని.. 'వినియోగించని వర్కింగ్ క్యాపిటల్, కాలావధి రుణాలు' ఇందులో కలిసి ఉన్నాయని వివరించారు. పలు ప్రాజెక్టుల రుణాలు కూడా ఇందులో ఉన్నాయని స్పష్టం చేశారు. గత కొంతకాలంగా నెమ్మదించిన కార్పొరేట్ రుణాలు, జులై-సెప్టెంబరు త్రైమాసికంలో 7.1% వృద్ధి చెందాయి. అక్టోబరు-మార్చిలోనూ ఈ విభాగం రెండంకెల వృద్ధిని సాధించే అవకాశం ఉందని ఎస్‌బీఐ ఛైర్మన్ అంచనా వేశారు. ఆర్థిక కార్యకలాపాలు మెరుగుపడటం వల్ల వర్కింగ్ క్యాపిటల్ అవసరాలు పెరుగుతున్నాయని, త్రైమాసికం వారీగా ఇది అధికమవుతున్న ధోరణి కనిపిస్తోందన్నారు. కాలావధి రుణాల విషయానికొస్తే.. ఇప్పటికే ఆమోదించిన రుణాలను పంపిణీ చేస్తున్నామని, కొన్ని ప్రాజెక్టుల రుణాలు చర్చల్లో ఉన్నాయని తెలిపారు. రుణాల వృద్ధి కోసం, 15% మూలధన లభ్యత నిష్పత్తిని కొనసాగించేందుకు వచ్చే 5-6 ఏళ్లలో బ్యాంక్‌కు ఎటువంటి ఈక్విటీ మూలధనం అవసరం లేదని వివరించారు.

## మరోసారి భగ్గుమన్న బంగారం, వెండి ధరలు.. కళ్లు తేలేస్తున్న వినియోగదారులు



బంగారం, వెండి ధరలు మళ్లీ భగ్గుమన్నాయి. అంతర్జాతీయ ధరలను అనుసరించి దేశీయంగానూ వీటి ధరలు మరోసారి భారీగా పెరిగాయి. పసిడి రూ.1.30 లక్షల పైనే పలుకుతుండగా.. వెండి కిలో ధర రూ.1.96 లక్షలు దాటేసింది. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో సోమవారం ఉదయం 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.660 పెరిగి రూ.1,30,480గా నమోదైంది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,19,570గా ఉందని బులియన్ వర్గాలు తెలిపాయి. కిలో వెండి ధర ఏకంగా రూ.4 వేలు పెరిగి రూ.1,96,000గా నమోదైంది. కాగా, అమెరికా ఫెడరల్ రిజర్వ్ డిసెంబర్ నెల పాలసీ కమిటీ భేటీలో వడ్డీ రేట్లు తగ్గిస్తుందన్న అంచనాలతో బంగారం, వెండికి డిమాండ్ విపరీతంగా పెరిగింది. దీంతో స్పాట్ గోల్డ్ ఔన్సు 4,218 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. వెండి సైతం రికార్డు గరిష్ఠానికి చేరి 57.76 డాలర్ల వద్ద కొనసాగుతోంది. ఈ ధరలను అనుసరించి దేశీయంగా బంగారం, వెండి ధరలు 2026లో భారీగా పతనమవుతాయనే చాన్స్ ఉందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు.

## ఫండ్స్‌లో రూ.5000 పొదుపుతో రూ.1 కోటి



దేశీయ మ్యూచువల్ ఫండ్ మార్కెట్లో రెండు దశాబ్దాలు విజయవంతంగా పూర్తి చేసుకున్న ఈక్విటీ పథకాల్లో ఐసీఐసీఐ ప్రూడెన్షియల్ వాల్యూ ఫండ్ ఒకటి. ఈ స్కీమ్‌ను 2004, ఆగస్టు 16వ తేదీన లాంచ్ చేశారు. మార్కెట్లో ఎలాంటి పరిస్థితులు ఉన్నా ఈ స్కీమ్ స్థిరమైన రాబడులు అందిస్తూ తమ ఇన్వెస్టర్లకు భారీ లాభాలు అందించింది. ఆస్తుల పరంగా చూస్తే భారత్‌లోని టాప్-10 స్కీమ్స్‌లో ఈ ఐసీఐసీఐ ప్రూ వాల్యూ ఫండ్ ఒకటి. అలాగే ఐసీఐసీఐ ప్రూడెన్షియల్ మ్యూచువల్ ఫండ్ పోర్ట్‌ఫోలియోలో ఇదే లార్జెస్ట్ ఈక్విటీ ఫండ్. ఈ ఫండ్ లాంచ్ అయి 21 ఏళ్ల 3 నెలల 12 రోజులు పూర్తి చేసుకుంది. అప్పుడు లంప్‌సమ్ పెట్టుబడి పెట్టి ఉంటే 48.5 రెట్లు లాభాలు అందించింది. ఇక నెలవారీగా రూ.5000 చొప్పున సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ ద్వారా పొదుపు చేసిన వారికి రూ.1 కోటికి పైగా అందించింది. వాల్యూ మ్యూచువల్ ఫండ్స్ వాల్యూ ఇన్వెస్టింగ్ స్ట్రాటజీ ఫాలో అవుతుంది. ఇందులో భాగంగా ఫండ్ మేనేజర్స్ స్టాక్స్ నష్టాల్లో ఉన్నప్పుడు వాటిల్లో ఇన్వెస్ట్ చేస్తారు. అలాంటి స్టాక్స్ దీర్ఘకాలంలో మంచి రాబడులు ఇచ్చే అవకాశం ఉంటుంది. అయితే, ఇక్కడ సైతం హైరిస్క్ ఉంటుంది. రిస్కో మీటర్‌లో వాల్యూ ఫండ్స్ వెరీ హై రిస్క్ కేటగిరీలోకి వస్తాయి. లంప్ సమ్ పెట్టుబడిపై లాంచ్ నుంచి ప్రతి ఏడాదికి 20.15 శాతం రాబడి అందించింది. రూ.10 లక్షలు ఇన్వెస్ట్ చేసి ఉంటే రూ.4,98,56,000 అవుతుంది. ఇక 3 ఏళ్లలో 21.23 శాతం, 5 ఏళ్లలో 25.18 శాతం, 7 ఏళ్లలో 19.83 శాతం, 10 ఏళ్లలో 15.76 శాతం, 15 ఏళ్లలో 16.52 శాతం, 20 ఏళ్లలో 17.53 శాతం మేర లాభాలు అందించింది. గత 21 ఏళ్లలో వార్షిక రాబడులు 18.46శాతం మేర రాబడులు ఇచ్చింది. నెల వారీగా రూ.5000 పొదుపు చేసినట్లయితే 21 ఏళ్లలో రూ.12,60,000 పెట్టుబడి అవుతుంది.

## కొత్త రికార్డుల్లో సూచీలు


దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారాన్ని ఉత్సాహంగా ప్రారంభించాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు ఉన్నప్పటికీ.. ఆర్‌బీఐ వడ్డీ రేట్ల కోత అంచనాలు, దేశీయంగా కొనుగోళ్ల అండతో బుల్ దూసుకెళ్తోంది. దీంతో సూచీలు కొత్త రికార్డుల్లో పరుగులు పెడుతున్నాయి. సెన్సెక్స్ 86వేల మార్క్ దా 383 పాయింట్లు ఎగబాకి 86,089 వద్ద నిఫ్టీ 108 పాయింట్ల లాభంతో 26,311 వద్ద ట్రేడ్ అవుతున్నాయి. నిఫ్టీలో ఎస్‌బీఐ, ట్రెంట్, శ్రీరామ్ ఫైనాన్స్, టాటా స్టీల్, రిలయన్స్ ఇండస్ట్రీస్ రాణిస్తుండగా.. టెక్ మహీంద్రా, టాటా కన్జ్యూమర్, టైటాన్ కంపెనీ, బజాజ్ ఫైనాన్స్ ఒత్తిడికి గురవుతున్నాయి. బ్యాంక్ నిఫ్టీ తొలిసారి 60వేల మార్క్ దాటింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 89.46 వద్ద కొనసాగుతోంది.



రెండో త్రైమాసిక జీడీపీ గణాంకాలు అంచనాలను మించి వెలువడడం, ఈనెల 5న వెల్లడయ్యే ఆర్‌బీఐ ద్వైమాసిక సమీక్షలో 'రేట్ల కోత జరగొచ్చనే అంచనాలు' దేశీయ మార్కెట్ సెంటిమెంట్‌ను బలపర్చాయి. అటు ఆసియా పసిఫిక్ మార్కెట్లు మిశ్రమంగా కదలాడుతున్నాయి. హాంకాంగ్ హాంగ్‌సెంగ్ సూచీ 0.13శాతం లాభంతో ట్రేడ్ అవుతోంది. జపాన్ నిక్కీ 1.3శాతం, దక్షిణ కొరియా కోస్పి 0.66శాతం, ఆస్ట్రేలియా ఏఎస్ఎక్స్ సూచీ 0.23శాతం మేర నష్టాల్లో ఉన్నాయి. ఫెడ్ వడ్డీ రేట్ల కోత అంచనాలతో గత శుక్రవారం అమెరికా మార్కెట్లు లాభపడ్డాయి. నాస్‌డాక్ 0.65శాతం, ఎస్అండ్‌పీ 500 సూచీ 0.54శాతం, డోజోన్స్ 0.61శాతం మేర పెరిగాయి.

## సచిన్ రికార్డుపై కన్నేసిన కోహ్లీ..

ఏకంగా 70 అవార్డులతో రాంచీ వేదికగా దక్షిణాఫ్రికా, భారత్ మధ్య జరిగిన తొలి వన్డేలో సెంచరీతో విరాట్ కోహ్లీ రెచ్చిపోయిన సంగతి తెలిసిందే. చాలా రోజుల తర్వాత విరాట్ కోహ్లీ ఈ సెంచరీ నమోదు చేసుకొని, విమర్శకుల నోళ్లకు తాళం వేశారు. అంతేకాదు 2027 వన్డే వరల్డ్ కప్ లో తాను ఆడతానని, నన్నెవరూ ఆపలేరనే సంకేతాన్ని బ్యాట్ ద్వారా ఇచ్చారు కింగ్ కోహ్లీ. ఇక ఈ తొలి వన్డేలో విరాట్ కోహ్లీ చేసిన సెంచరీ కారణంగా దక్షిణాఫ్రికాపై భారత్ అఖండ విజయాన్ని నమోదు చేసుకుంది. ఏకంగా 17 పరుగులతో భారత జట్టు గ్రాండ్ విక్టరీ కొట్టింది. దీంతో టెస్ట్ సిరీస్ ఓటమి బాధలో ఉన్న భారత అభిమానులకు కాస్త ఊరట లభించింది. రాంచి వేదికగా జరిగిన తొలి వన్డే మ్యాచ్ లో అద్భుతంగా రాణించిన విరాట్ కోహ్లీకి ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు కూడా దక్కింది. ఈ తరుణంలో మరో అరుదైన రికార్డుకు విరాట్ కోహ్లీ దగ్గరయ్యాడు. ఇప్పటి వరకు విరాట్ కోహ్లీ తన అంతర్జాతీయ క్రికెట్ లో మొత్తం 70 ప్లేయర్ ఆఫ్ ద అవార్డులు దక్కించుకున్నాడు. మరో ఆరు అవార్డులు సాధిస్తే, సచిన్ టెండూల్కర్ రికార్డులు బద్దలు కొట్టనున్నాడు విరాట్ కోహ్లీ. అటు 664 మ్యాచ్ లు ఆడిగిన సచిన్ టెండుల్కర్, మొత్తం 76 అవార్డులు దక్కించుకున్నాడు. విరాట్ కోహ్లీ 554 మ్యాచ్ ల్లోనే 70 అవార్డ్స్ అందుకొని చరిత్ర సృష్టించాడు. వీళ్ళిద్దరి తర్వాత జయసూర్య 58 అవార్డ్స్ తో మూడో స్థానంలో ఉండగా జాక్వేస్ కలీస్ 57 అవార్డులతో నాలుగో స్థానంలో కొనసాగుతున్నారు. 2027 వన్డే వరల్డ్ కప్ వరకు రిటైర్మెంట్ ప్రకటించకుండా ఉండి ఉంటే, సచిన్ టెండుల్కర్ రికార్డును కోహ్లీ బద్దలు కొట్టడం గ్యారంటీ అంటున్నారు క్రీడా విశ్లేషకులు.



## 'చాయ్ చేసినంత ఈజీగా'.. కోహ్లీ సెంచరీ !

భారత స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ అద్భుతమైన సెంచరీ సాధించాడు. రోజున భారత్ వర్సెస్ దక్షిణాఫ్రికా మధ్య రాంచీ వేదిక మొదటి వన్డే జరిగిన సంగతి తెలిసిందే. ఈ మ్యాచ్ లో 17 పరుగులతో భారత జట్టు గ్రాండ్ విక్టరీ కొట్టింది. అయితే ఈ మ్యాచ్ సందర్భంగా విరాట్ కోహ్లీ అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. తన 52వ సెంచరీ కూడా ఈ మ్యాచ్ సందర్భంగా పూర్తి చేసుకున్నాడు విరాట్ కోహ్లీ. దీంతో దేశ వ్యాప్తంగా విరాట్ కోహ్లీ ఆట తీరుపై ప్రశంసల వర్షం కురుస్తోంది. మాజీ క్రికెటర్లు అయితే, విరాట్ కోహ్లీని ఆకాశానికి ఎత్తుతున్నారు. ఈ నేపథ్యంలో విరాట్ కోహ్లీ సెంచరీ సాధించడంపై వీరేంద్ర



సెహ్వాగ్ కూడా రియాక్ట్ అయ్యారు. చాయ్ చేసినంత ఈజీగా పరుగులు చేయగలనని విరాట్ కోహ్లీ మరోసారి నిరూపించినట్లు పేర్కొన్నారు. రికార్డులను విరాట్ కోహ్లీ వెంబడించడం కాదు, ఆ రికార్డులే విరాట్ కోహ్లీని చేజింగ్ చేస్తాయని పేర్కొన్నారు వీరేంద్ర సెహ్వాగ్. అదే విరాట్ కోహ్లీ ఆకలి, ఆవేశం అంటూ వ్యాఖ్యానించారు. కింగ్ ఎప్పటికీ కింగ్ అంటూ కితాబ్ ఇచ్చారు. వీరేంద్ర సెహ్వాగ్ ఒక్కడే కాదు సునీల్ గవాస్కర్, మహమ్మద్ కైఫ్ లాంటి ప్లేయర్లు కూడా స్పందించారు. ది గోట్ అంటూ సునీల్ గవాస్కర్ పేర్కొనగా, ఓల్డ్ ఇస్ గోల్డ్ అంటూ మహమ్మద్ కైఫ్ వెల్లడించారు. ఇలా ఉండగా దక్షిణాఫ్రికా తో జరిగిన తొలి వన్డే మ్యాచ్ లో టీమ్ ఇండియా నిర్ణీత 50 ఓవర్లలో 349 పరుగులు సాధించింది. ఈ లక్ష్యాన్ని చేదించే క్రమంలో దక్షిణాఫ్రికా బాగానే పోరాడింది. కాని చివరకు 49.2 ఓవర్స్ లో 332 పరుగులు మాత్రమే సాధించి ఓడిపోయింది దక్షిణాఫ్రికా.

## కోహ్లీ ఫ్యాన్ లైఫ్ టైం మూమెంట్



ఏడు సిక్సర్లు బాదిన విరాట్ కోహ్లీ ఏకంగా 11 బౌండరీలతో రెచ్చిపోయాడు. అయితే, ఈ మ్యాచ్ లో 52వ సెంచరీని కోహ్లీ పూర్తి చేసుకున్నాడు. దీంతో సచిన్ టెండూల్కర్ రికార్డును బద్దలు కొట్టాడు. ఇక కోహ్లీ తన శతకాన్ని సెలబ్రేట్ చేసుకునే సమయంలో ఆసక్తికర సంఘటన జరిగింది. ఉన్నఫలంగా ఓ అభిమాని ప్రేక్షకుల మధ్యలోంచి, దూసుకు వచ్చాడు. కేఎల్ రాహుల్ చూస్తూ ఉండగానే, విరాట్ కోహ్లీ కాళ్ళ పైన పడిపయాడు.

దక్షిణాఫ్రికాతో ఆదివారం రోజున తొలి వన్డే మ్యాచ్ లో భారత జట్టు తలపడిన సంగతి తెలిసిందే. ఈ తొలి వన్డే మ్యాచ్ లో అద్భుతంగా రాణించిన భారత జట్టు, 17 బంతుల తేడాతో విజయం సాధించింది. ముఖ్యంగా విరాట్ కోహ్లీ అద్భుతమైన సెంచరీతో రెచ్చిపోయాడు. రాంచీ వేదికగా జరిగిన ఈ మ్యాచ్ లో చాలా కసిగా ఆడాడు విరాట్ కోహ్లీ. దానికి తగ్గట్టుగానే పరుగులు రాబట్టి, సెంచరీ నమోదు చేసుకున్నాడు. 120 బంతులు ఫేస్ చేసిన విరాట్ కోహ్లీ, మొత్తం 135 పరుగులు సాధించగలిగాడు. తన సెంచరీలో వెంటనే సెక్యూరిటీ సిబ్బంది అలర్ట్ అయి, వెంటనే ఆ అభిమానిని అక్కడి నుంచి తీసుకువెళ్లింది. ఈ సంఘటనకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు వైరల్ గా మారాయి. కాగా విరాట్ కోహ్లీ అభిమానికి ఇది లైఫ్ టైం మూమెంట్ అని కొంతమంది కామెంట్స్ చేస్తున్నారు. అభిమానాన్ని ఇలా కూడా చూపించాలా ? ఆటగాడికి ఏదైనా ఆపద జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని మరి కొంతమని నిర్వహిస్తున్నారు. కొంత మంది ఫ్యాన్స్.. కోహ్లీ కోసం ప్రాణాలు కూడా ఇచ్చేస్తారని ఇంకొంత మంది అంటున్నారు.

## ఐపీఎల్‌కు వీడ్కోలు పలికిన ఆండ్రీ రస్సెల్ కేకేఆర్ 'పవర్ కోచ్'గా కొత్త బాధ్యతలు



వెస్టిండీస్ విధ్వంసకర ఆల్‌రౌండర్, కోల్‌కతా నైట్ రైడర్స్ స్టార్ ప్లేయర్ ఆండ్రీ రస్సెల్ ఇండియన్ ప్రీమియర్ లీగ్ కు వీడ్కోలు పలికాడు. 2026 ఐపీఎల్ మినీ వేలానికి కేవలం రెండు వారాల సమయం ఉండగా రస్సెల్ ఈ సంచలన నిర్ణయం ప్రకటించాడు. అయితే, క్రికెటర్‌గా తప్పుకున్నప్పటికీ కేకేఆర్‌తో తన బంధాన్ని కొనసాగించనున్నాడు. జట్టు 'పవర్ కోచ్'గా కొత్త బాధ్యతలు చేపట్టబోతున్నట్లు వెల్లడించాడు.రస్సెల్ రిటైర్మెం ట్ నిర్ణయంపై కేకేఆర్ సహయజమాని, బాలీవుడ్ బాద్‌షా షారూఖ్ ఖాన్ సోషల్ మీడియా వేదికగా భావోద్వేగంతో స్పందించారు. "అద్భుతమైన జ్ఞాపకాలకు ధన్యవాదాలు ఆండ్రీ. మా జట్టుకు నువ్వో కవచం లాంటివాడివి. కేకేఆర్‌కు నీ సేవలు మరువలేనివి. క్రీడాకారుడిగా నీ ప్రయాణంలో ఇది మరో అద్భుత అధ్యాయం. ఇకపై 'పవర్ కోచ్'గా మా కుర్రాళ్లకు నీ అనుభవాన్ని, శక్తిని పంచుతావని విశ్వసిస్తున్నాను. నీకు పర్పుల్ అండ్ గోల్డ్ జెర్సీ తప్ప మరేదీ సరిపోదు. మజిల్ రస్సెల్ ఫర్ లైఫ్!" అంటూ షారూఖ్ ట్వీట్ చేశారు.కాగా, ఈ కొత్త బాధ్య తలు చేపట్టే ముందు తాను షారూఖ్‌తో చాలాసార్లు చర్చించినట్లు రస్సెల్ తన వీడియోలో తెలిపాడు. అభిషేక్ నాయర్ నేతృత్వంలోని కొత్త కోచింగ్ బృందంలో రస్సెల్ చేరనున్నాడు. ఈ బృందంలో షేన్ వాట్సన్, టిమ్ సౌథీ కూడా ఉన్నారు. కేకేఆర్ తరఫున తన కెరీర్‌లో రస్సెల్ 2,593 పరుగులు చేయడంతో పాటు 122 వికెట్లు పడగొట్టాడు. ఈ ఏడాది ఆరంభంలోనే ఆండ్రీ రస్సెల్ అంతర్జాతీయ క్రికెట్‌కు కూడా రిటైర్మెంట్ ప్రకటించిన విషయం తెలిసిందే.

